
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
గురువారం 14 ఆగస్టు 2025



నిర్లక్ష్యపు హైవే..!

ప్రయాణాన్ని సులభతరం.. సుఖప్రదంగా మార్చడంలో జాతీయ రహదారుల పాత్ర కీలకం. హైవేపై వాహనాలు ట్రాఫిక్ లేకుండా రయ్..రయ్ అంటూ ముందుకు సాగుతాయి. కర్నూలు-విజయవాడకు జాతీయ రహదారిగా 341సీగా అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. వైసీపీ పాలనలో మొదలైన నిర్మాణాలపై సరైన పర్యవేక్షణ లేకపోగా నగరపాలక సంస్థ కమిషనర్ల బదిలీలు రోడ్డు నిర్మాణాలకు అడ్డంకిగా మారాయి. కర్నూలు నగర శివారు నుంచి గార్గేయపురం గ్రామ శివారులోని హైవే వరకు 9.5 కిలోమీటర్లకు రూ.96.05 కోట్లు మంజూరయ్యాయి. 2.5 కి.మీ కర్నూలు నగరంలోని నగరపాలక సంస్థ పరిధిలో ఉండటంతో సమస్య మొదలైంది. ఎస్ఎస్ గార్డెన్ నుంచి గార్గేయపురం వరకు భూసేకరణ పనులు పూర్తయ్యాయి. కానీ అక్కడి నుంచి నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు వరకు గల రోడ్డు 2.5కిలోమీటర్లు గల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ మొండికేసింది.



జాతీయ రహదారి పనులకు సంబంధించిన డ్రైనేజీ నిర్మాణాలు

కర్నూలు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణపు పనులు నిర్లక్ష్యపు నీడలో కొనసాగుతున్నాయి. నగరపాలక సంస్థ నిర్లక్ష్యంతో హైవే నిర్మాణం అటకెక్కింది. కర్నూలు-విజయవాడకు జాతీయ రహదారిగా 341సీగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. వైసీపీ పాలనలో మొదలైన నిర్మాణాలపై సరైన పర్యవేక్షణ లేకపోగా నగరపాలక సంస్థకు కమిషనర్ల బదిలీలు రోడ్డు నిర్మాణాలకు అడ్డంకిగా మారాయి. రోడ్డు నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియపై నిర్లక్ష్యం కారణంగా నిర్మాణాలు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి రోడ్లు, భవనాల శాఖకు ఉన్నప్పటికీ పురోగతి లేకపోవడం గమనార్హం. కర్నూలు నుంచి రాజధాని అమరావతికి జాతీయ రహదారిని కేంద్ర ప్రభుత్వం నిర్మాణాలకు అవసరమైన నోటిఫికేషన్ జారీ చేసి టెండర్లు ఖరారు, నిర్మాణాల్లో జాప్యం జరిగినా అదే జాప్యం నేటి వరకు కొనసాగుతుండం వాహనదారులకు ఇబ్బందికరంగా తయారైంది.

డీపీఆర్ జారీలో నిర్లక్ష్యం..



కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి 341సీ పనుల్లో నగరపాలక సంస్థ పరిధిలో స్థలం కోల్పోయిన యజమానులకు పరిహారంగా డీపీఆర్ బాండ్లను ఇవ్వాల్సి ఉంది. బాండ్ల జారీలో నిర్లక్ష్యం చేస్తూ రావడంతో విస్తరణ ప్రక్రియకు సంబంధించి నిధులు రద్దు అయ్యే అవకాశం ఉందని ఇంజనీర్లు అంటున్నారు. 2022 మార్చి2న మొదలైన పనులు నిలిచిపోయాయి. కర్నూలు నగర శివారు నుంచి గార్గేయపురం గ్రామ శివారులోని హైవే వరకు 9.5 కిలోమీటర్లకు రూ.96.05 కోట్లు మంజూరయ్యాయి. 2.5 కి.మీ కర్నూలు నగరంలోని నగరపాలక సంస్థ పరిధిలో ఉండటం సమస్య మొదలైంది. ఎస్ఎస్ గార్డెన్ నుంచి గార్గేయపురం వరకు భూసేకరణ పనులు పూర్తయ్యాయి. కానీ అక్కడి నుంచి నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు వరకు గల రోడ్డు 2.5కిలోమీటర్లు గల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ మొండి కేసింది. 2023లోనే పూర్తి కావాల్సిన నిర్మాణాలు గడువు మీద మీద గడువు కోరుతూ వచ్చారు. మరో ఆరునెలల్లో పూర్తి చేయని పక్షంలో రోడ్డును నిర్మాణాలకు అవసరమైన అగ్రిమెంట్లను కేంద్ర ప్రభుత్వం రద్దుచేస్తామని ఇప్పటికే నోటీసులు జారీచేసింది. నగరపాలక సంస్థ స్పందించని పక్షంలో రోడ్డు నిర్మాణాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఎన్‌హెచ్ శాఖ అధికారులు ఆందోళన పడుతున్నారు.

- అటకెక్కిన నిర్మాణ పనులు
- నగరపాలక సంస్థ పరిధిలో ఉండటంతో సమస్య
- మరో ఆరునెలలు గడువు కోరిన ఎన్‌హెచ్ శాఖ
- డీపీఆర్ జాప్యంతో భూసేకరణకు అడ్డంకులు
- 2022 నుంచి కొనసాగుతున్న వైనం

నిర్మాణాల్లో నాణ్యతపై..

ఎస్ఎస్ గార్డెన్ సమీపంలో ఇటీవల రోడ్డుకు ఒక వైపు డ్రైనేజీ నిర్మాణాలు చకచక సాగుతున్నాయి. ఫలితంగా కాలనీలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్లు నిర్మాణాలను చేపట్టడం, నిర్మాణాల్లో నాణ్యతపై కాలనీ ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపట్టి వారం రోజుల్లో డ్రైనేజ్ కప్పేస్తుండంతో క్యూరింగ్ సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదేవిషయంపై జాతీయ రహదారుల శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా నిర్మాణాలు డ్రాఫ్ట్, అగ్రిమెంట్ ప్రకారమే జరుగుతున్నాయంటూ దాట వేశారు.

నిత్యం ప్రమాదాలు

నగరశివారులో రోడ్ల నిర్మాణాలు అస్తవ్యస్తంగా ఉండటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. భూపాల్‌నగర్, ఎల్లమ్మ దేవాలయం, సూదిరెడ్డిపల్లె, వెంకా యపల్లె, పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ వరకు రోడ్లకు ఇరువైపుల డివైడర్లు లేకపోవడం, డ్రైనేజ్ సమస్య, నిలిచిపోయిన నిర్మాణాల స్థానంలో కల్వర్టులు రిపేర్లకు నోచుకోక పోవడంతో ప్రమాదకరంగా తయారైంది. వెంకాయపల్లెలోని పుల్లయ్య కాలేజీ ఎదురుగా డ్రైనేజీ సమస్య జఠిలంగా తయారైంది. చిన్నపాటి వర్షం పడితే వర్షం నీరు దుకాణాల్లోకి చేరి పోతోంది. ఫలితంగా వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

డీపీఆర్ బాండ్లలో జాప్యంతోనే ఆలస్యం

భూసేకరణ జాప్యంతోనే ఆలస్యం అవుతోంది. మరో ఆరునెలల గడువు కోరాం. విస్తరణ పనులు నగర శివారులోని 2.5 కిలోమీటర్‌లోనే నిలిచిపోయింది. మరో నాలుగు కిలోమీటర్లకు సంబంధించి భూసేకణ పూర్తయింది. పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు జరుపుతున్నాం.

● జగదీష్ గుప్త, డీఈ, జాతీయ రహదారుల శాఖ(ఎన్‌హెచ్)

పదవులకు ఓపికే అర్హత

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



పార్వతమ్మ, ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని, పదవులు దక్కాలంటే ఓపికగా ఉండటమే అర్హత అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి తిక్కారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా రాష్ట్రస్థాయిలో పలు కార్పొరేషన్లకు ఛైర్మన్ పదవులు దక్కించుకున్న ఆకెపోగు ప్రభాకర్, పార్వతమ్మలను సత్కరించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్ట సమయాల్లో పనిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి న్యాయం చేస్తోందన్నారు. పులివెందుల, ఒట్టిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయన్నారు. కౌంటింగ్ కంటే ముందే వైసీపీ ఓటమిని అంగీకరించి లేనిపోని ఆరోపణలు చేస్తోందన్నారు. కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పులివెందుల వైసీపీ నేత సతీష్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపడాన్ని పులివెందుల ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బొందిలి అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ఎంపికైన విక్రమ్ సింగ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ధరూర్ జేమ్స్, వీటీ విజయ్‌కుమార్, నంద్యాల నాగేంద్ర, నాయకులు హనుమతరావు చౌదరి, సత్రం రామకృష్ణుడు, రమేష్‌రెడ్డి, పుల్లయ్యచౌదరి, పేరపోగు రాజు తదితరులు పాల్గొన్నారు.


వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు మూడు రోజులుగా అధిక వర్షపాతం నమోదైందన్నారు. జూన్, జూలై నెలలో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఆగస్టులో ఇప్పటి వరకు 146.5 మీ.మీ.లతో 27.8 శాతం అధిక వర్షపాతం నమోదయిందని తెలిపారు. నదీతీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా తహసీల్దార్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యంపై దృష్టిసారించాలని, వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. వచ్చే వారం 'పల్లెకు పోదాం' కార్యక్రమం సందర్భంగా స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలను సందర్శించి గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, అంగన్‌వాడీలు, స్కూల్స్ తదితర అన్ని అంశాలపై తనిఖీ చేస్తారని, మండల, గ్రామ స్థాయి అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్ వెంట తహసీల్దార్లు, ఎంపీడీవోలు తమ టీములతో వెళ్లాలని ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు సాగు..

- జిల్లాలో పంటల సాగు 3.32 లక్షల హెక్టార్లు
- గతేడాది 1.89 లక్షల హెక్టార్లు



పంట	హెక్టార్లలో
పత్తి	2,14,378
కందులు	38,105
వేరుశనగ	27,751
కూరగాయలు	23,053
ఉల్లి	10,797
ఆముదం	8,890
సద్ద	5,540
మిరప	5,538
వరి	5,521
మొక్కజొన్న	5,095
తృణధాన్యాలు	2,661
కొర్ర	2,660
మినుములు	421
జొన్న	149
టమోటా	127
పొద్దు తిరుగుడు	107
పొగాకు	100
సోయాబీన్	37
చెరుకు	34
మొత్తం	3,32,722

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో మునుపెన్నడూ లేని విధంగా 3లక్షలకు పైగా హెక్టార్లలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. గతేడాది ఇదే సమయానికి ఖరీఫ్‌లో 1,89,483 హెక్టార్లలో పంటలు సాగు కాగా ఈ ఏడాది 3,32,722 హెక్టార్లలో అన్నీ పంటలు కలిపి సాగయ్యాయి. అదేవిధంగా ప్రధాన పంట పత్తి గత సంవత్సరం ఇదే సమయానికి 1,10,892 హెక్టార్లలో మాత్రమే సాగు కాగా, ఈ సంవత్సరం 2,14,378 హెక్టార్లలో సాగయ్యాయి. రాష్ట్రంలోనే పత్తి పంట సాగులో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉన్నట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటల వివరాలను పరిశీలిస్తే...

అప్రమత్తంగా ఉండండి : వరలక్ష్మి, జేడీ



గత నాలుగు రోజుల నుంచి వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. పొలాల్లో నీటి నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్తపడాలి. నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకపోతే పైర్లపై వివిధ రకాల తెగుళ్లు, క్రిమి కీటకాలు వ్యాపించే ప్రమాదం ఉంది. అదే విధంగా రైతులు ఇష్టానుసారం ఎరువులు వాడరాదు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలి.

నేనేమి చేశాను పాపం..

- ఉమ్మడి జిల్లాలో ఆగని భ్రూణ హత్యలు
- నిద్రమత్తులో వైద్య ఆరోగ్య శాఖ
- గాడితప్పిన స్కానింగ్ కేంద్రాల నిర్వహణ
- యథేచ్ఛగా లింగ నిర్ధారణ
- ఆర్ఎంపీలతో అబార్షన్లు
- కాసుల కక్కుర్తికి ఆడబిడ్డలు బలి

చిదిమేస్తున్నారు..!



ఆడపిల్లలను ఆదిలోనే చిదిమేస్తున్నారు.. లింగ నిర్ధారణ పరీక్షలతో పుట్టక ముందే చంపేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు జోరుగా సాగుతున్నాయి. కొందరు అనర్హులు, ఆర్ఎంపీలు, వైద్యులు కాసుల కక్కుర్తితో ఎంతో మంది పసిప్రాణాలను తుంచేస్తున్నారు. లింగనిర్ధారణలో ఆడపిల్ల అని తేలితే కొంతమంది తల్లిదండ్రులు ఆడ పిల్లలను భారంగా భావించి ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే ఆసరాగా ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడపిల్లలను ఈలోకంలోకి అడుగు పెట్టకుండా చేస్తున్నారు. భ్రూణహత్యల నివారణ కోసం పీసీపీఎన్‌డీటీ యాక్టు అమలులో జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఎంతో కీలకమైంది. ఈకమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. సభ్యులుగా జిల్లా జడ్జి, ఎస్పీ, డీఎంహెచ్‌వో ఎన్‌జీవోలు ఉంటారు. ఈ కమిటీ స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయడం, రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయడం, లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై దాడులు చేయాలి. కర్నూలు జిల్లాలో మాత్రం జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ నామ మాత్రంగా పని చేస్తుంది.

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యం స్కానింగ్ కేంద్రాలకు కాసులు కురుస్తున్నాయి. లింగ నిర్ధారణ పరీక్షలపై నిషేధం ఉన్నా ఉన్న ఆర్ఎంపీల సహాయంతో గర్భంలోనే ఆడ శిశువులను చిదిమేస్తున్నారు. తాజాగా నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన శ్రీవాణి ఆర్ఎంపీ చేసిన అబార్షన్ వికటించి ప్రాణం కోల్పోయింది. ఆ గర్భిణికి కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లో స్కానింగ్ చేసి లింగ నిర్ధారణ చేశారని నంద్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ కర్నూలు జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.శాంతికళకు లేఖ రాశారు. దీన్నిబట్టి జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు ఏమేరకు పనిచేస్తున్నాయో అర్థమవుతుంది. రక్ష హాస్పిటల్‌లోని స్కానింగ్ సెంటరులో లింగ నిర్ధారణ చేయించి అక్కడ ఆడబిడ్డ ఉన్నట్లు నిర్ధారణ చేసుకుని జూలై 29న నందికొట్కూరులోని ఓ క్లినిక్‌లో ఆర్ఎంపీ అబార్షన్ చేశారు. 30వ తేదీ గర్భిణి శ్రీవాణికి తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయింది.

మిగతా 6వ పేజీలో..

సారా రహిత జిల్లా లక్ష్యంగా పని చేయాలి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



సీఐలతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కర్నూలు అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల ఆఖరులోపు జిల్లాను సారా రహితా జిల్లాగా మార్చాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి అన్నారు. బుధవారం ఆమె తన చాంబర్‌లో అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంతరావు, సూపరిటెండెంట్ పి.సుధీర్ బాబు, నంద్యాల, కర్నూలు జిల్లాల ఎక్సైజ్ సీఐలతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ నవోదయం- 2.0ను ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పర్మిట్ రూమ్‌ల రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం బార్ పాలసీ ఈనెలాఖరుకు ముగుస్తుందని తెలిపారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో నంద్యాల ఈఎస్ రవీకుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రాజశేఖర్‌గౌడ్, డి.రామకృష్ణారెడ్డి, వి.రాముడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ప్రహ్లాదరాయలు

- వైభవంగా సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన
- బంగారు పల్లకిలో ఊరేగిన రాఘవేంద్రులు
- సంస్థాన పూజ చేసిన పీఠాధిపతి

6



వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ



కలెక్టరేట్ ఎదుట జరిగిన సభలో మాట్లాడుతున్న రైతు, ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులను ఎలాంటి ప రిస్థితుల్లో అమెరికా, బ్రిటన్లతో ఒప్పందం చేసుకోకుండా వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు నగరంలోని సుందరయ్య కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. అనతరం రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాక రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బ్రిటన్ ప్రభుత్వాలతో చేసుకునే ఒప్పందం వల్ల మన వ్యవసాయం రంగం తీవ్రమైన సంక్షోభంలో పోవడానికి అవకాశం ఉందన్నారు. తక్షణమే కార్పొరేట్ అనుకూలమైన విధానాలకు స్వస్తి పలకాలని, లేని పక్షంలో రాబోయే కాలంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టి.రాముడు, రాజశేఖర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో సెప్టెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులే కాకుండా ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. కక్షిదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మున్సిపల్, విద్యుత్, బ్యాంకింగ్, విద్యా రంగాల్లో ఉన్న వివాదాలే కాకుండా రాజీకి వీలుండే క్రిమినల్, సివిల్ కేసులను కూడా పరిష్కరిస్తామని తెలిపారు.

సాంకేతిక నైపుణ్యం అందించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యం అందించగలిగితే ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు పొందవచ్చని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో బుధవారం స్కూలింగ్, బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్‌షాపులో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా విద్యారంగాన్ని, మానవ వనరులను అభివృద్ధి చేసి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. అందులో భాగంగా ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ, కనీస కల్పన, విద్యలో సాంకేతికత సంబంధాల విషయాలపై సలహాలు, సూచనలు ఇవ్వడం కోసం ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా 2047ను రూపొందించేందుకు ప్రస్తుతం 3 నుంచి 18 సంవత్సరాలు గల పిల్లలందరికీ విద్యలో కావాల్సిన టెక్నాలజీ, నైపుణ్యాలు అందించగలిగితే 2030 సంవత్సరానికి భారతదేశంలో 60 శాతం మంది ఉత్పాదకత రంగంలో ఉంటారని, వారందరూ నైపుణ్యం గల వ్యక్తులుగా మారితే భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్ పాల్, సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్, సీఎంవో, ఏఎంవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

మరణంలోనూ ముగ్గురికి ప్రాణం

- బ్రెయిన్ డెడ్ అయిన శివరామ సుబ్బయ్య
- అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు



మెడికవర్ హాస్పిటల్‌లో అవయవదాతకు ఘన నివాళి

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మరణంలోనూ ముగ్గురికి ప్రాణం పోశాడు ఆవ్యక్తి. బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. బంధువులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా కోయిలకుంట్ల మండలం పెద్దకొప్పెర్ల గ్రామానికి చెందిన టి.శివ రామ సుబ్బయ్య(39) ఆగస్టు 10న స్నేహితులతో కలిసి నదిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారిపడటంతో అతని తలకు పెద్దరాయి బలంగా తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మలమడుగు హాస్పిటల్‌కు వెళ్లగా వారు కర్నూలుకు రెఫర్ చేశారు. అదేరోజు కర్నూలు ఓమిని హాస్పిటల్‌కు చేర్చి వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు ఈనెల 11వ తేదీన తీసుకువచ్చారు. 12వ తేదీన వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. జీవన్‌ధాన్ ట్రస్టు, మెడికవర్ హాస్పిటల్ చొరవతో శివరామసుబ్బయ్య అవయవాలను దానం చేయాలని కుటుంబసభ్యులకు చెప్పగా భార్య రామ సుబ్బమ్మ, తల్లిదండ్రులు అవయవదానంకు ముందుకు వచ్చారు. కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్ నేతృత్వంలో మెడికవర్ నెఫ్రాలజిస్టు డా.సిద్దార్థ హెరూర్, యురాలజిస్టు డా.అబ్దుల్ సమద్, డా.బి.ప్రవీణ్, డా.శరత్, వైద్య బృందం బుధవారం అవయవాలను సేకరించారు. సేకరించిన రెండు కిడ్నీల్లో ఒక కిడ్నీని నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు, మరో కిడ్నీని కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు, లివర్‌ను కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు పోలీసులు ఏర్పాటుచేసిన గ్రీన్‌చానల్ ద్వారా తరలించారు. అవయవదాత శివరామ సుబ్బయ్యకు మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి వైద్యులు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సాంఘిక దురాచారమైన బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కోరారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకుంటే చిన్నతనంలోనే గర్భధారణ వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, బాల్య వివాహాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ వ్యవస్థను రూపుమాపేందుకు ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పౌరహక్కుల రక్షణ, ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సంచార తెగల వారు న్యాయం పొందేలా తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు చైతన్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు డీఎంహెచ్‌వో పి.శాంతికళ, నంద్యాల డీఎంహెచ్‌వో ఆర్.వెంకటరమణ, కర్నూలు సీడీపీవో డైరెక్టర్ పి.విజయ, కర్నూలు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ బి.రాధిక, నంద్యాల గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.హుస్సేనయ్య, నంద్యాల జిల్లా మహిళా పోలీసు స్టేషన్ సీఐ పి.గౌతమి, ఉమ్మడి జిల్లాలోని రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 4వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జనం ఉత్సవం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 4న వినాయక నిమజ్జన ఉత్సవం సందర్భంగా ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ఉత్సవ నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు ఎలాంటి సమస్యలు రాకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహం నిమజ్జనానికి తగినట్లుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జరిగే నిమజ్జనోత్సవానికి పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.



సంస్థాన పూజ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



అశ్వవాహనుడైన ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ చేస్తున్న పీఠాధిపతి

అశ్వవాహనంపై ప్రహ్లాదరాయలు

- వైభవంగా సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన
- బంగారు పల్లకిలో రాఘవేంద్రుల విహారం
- సంస్థాన పూజ చేసిన పీఠాధిపతి

మంత్రాలయం ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా 6వ రోజు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. కర్ణాటకలోని నంజనగూడలో వెలసిన రాఘవేంద్ర స్వామి శిష్యులైన సుజ్ఞానేంద్రతీర్థుల బృందావనాన్ని పీఠాధిపతి ఆశీస్సులతో అక్కడి పండితులు ప్రత్యేక పూజలుచేసి, హారతులు ఇచ్చి శోభయానుమానంగా అలంకరించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు అశ్వవాహనంపై మఠం ప్రాంగణం చుట్టూ ఊరేగారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించి చెక్క, వెండి, బంగారు, రజిత రథోత్సవాలపై ఊరేగారు. ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాఘవేంద్ర బృందావన ప్రతిమను బంగారు పల్లకిలో ఊరేగించారు. సంస్థాన పూజల్లో భాగంగా పూర్ణబోధ పూజా మందిరంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూలరాములకు, జయరాములు, దిగ్విజయకరాములకు బంగారు నాణేలతో అభిషేకించి హారతులిచ్చారు. కార్యక్రమంలో పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందుమాధవ్, ద్వారపాలక అనంతస్వామి, జయతీర్థాచార్, వాదిరాజాచార్, డీఎం ఆనందరావు, జేపీ స్వామి, అనంతపురాణిక్, రవికులకర్ణి పాల్గొన్నారు.



బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

ఉత్సవాల్లో ఆరవ రోజైన బుధవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరుకు చెందిన సుధ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వారిచే హరిదర్శన్, నృత్యరూపకం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. బెంగుళూరు చెందిన విద్వాన్ ఎంఎస్ సుబ్బలక్ష్మి, బెంగుళూరు చెందిన దాసవాని సాహిత్యం భక్తులను కనువిందు చేశారు.

నేడు ఉత్సవాలకు ముగింపు

రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు గురువారం ముగియనున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సర్వసమర్పణోత్సవం చేసి ఉత్సవాలకు ముగింపు పలకనున్నారు. పంచ రథాలపై ప్రహ్లాదరాయలను అలంకరించి ఊరేగించనున్నారు. పీఠాధిపతి బృందావనానికి మహా మంగళహారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వదించి ఉత్సవాలకు ముగింపు పలుకుతారు. ఈ సందర్భంగా ఉత్సవాల ముగింపులో భా గంగా గురువారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరు చెందిన విద్వాన్ ఎన్ఎస్ ప్రసాద్‌చే పూణేకి చెందిన విద్వాన్ ఆనంద్ భీమ్‌సేన్ జోషిచే శాస్త్రీయ సంగీతం, చెన్నైకి చెందిన కళాకారుల బృందంచే భరతనాట్యం భక్తులను ఆకట్టుకోనున్నాయి.

'రక్షణ'లో రామరాజు

- డీఆర్‌డీవోలో కొలువు
- శాస్త్రవేత్తగా బాధ్యతలు
- ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం
- దేశానికి సేవ చేయాలన్నదే సంకల్పం
- పలువురి అభినందనలు




తల్లిదండ్రులు నాగేశ్వరరావు, ఈశ్వరమ్మలతో రామరాజు

కొలిమిగుండ్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రామరాజు అరుదైన ఘనతను సాధించారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన డీఆర్‌డీవో(భారత రక్షణ పరిశోధన సంస్థ)లో ఉద్యోగం సంపాదించారు. ఈమేరకు బుధవారం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రామరాజు 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో ముచ్చటించారు. కొలిమిగుండ్లకు చెందిన ఇరికమాను నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ నిరుపేద దళిత దంపతుల పెద్ద కుమారుడు రామరాజు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించారు. ప్రాథమిక విద్య కొలిమిగుండ్ల ఎస్సీ పాఠశాలలో చదవగా, అనంతరం ఏపీ గురుకుల పాఠశాలలో ఉన్నతవిద్యను అభ్యసించారు. ఇం టర్ ఎంపీసీలో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు, ప్రతిష్ఠాత్మకమైన జార్ఖండ్ రాంచీ ఎన్ఐటీ 2012లో సీటు సంపాదించారు. అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం రోశయ్య నుంచి రూ.25వేలు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం ఐఐఎస్సీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్) బెంగుళూరులో విద్యనభ్యసిస్తుండగా దేశంలో ప్రతిష్ఠాత్మకమైన ఐటీసీఎల్ కంపెనీలో 2017లో ఉద్యోగం పొందారు. అందులో ఇంజనీరుగా పని చేస్తూనే ఎలాగైనా భారత రక్షణ పరిశోధన సంస్థలో ఉద్యోగం సంపాదించాలన్న లక్ష్యంతో కష్టపడి చదివారు. దీంతో ఇటీవల గేట్ ఫలితాల్లో ఆల్ ఇండియా 70వ ర్యాంకు సాధించి, తన కలను సాకారం చేసుకున్నారు. అత్యున్నతమైన భారత రక్షణ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా అవకాశం రావడం పట్ల పలువురు అధికారులు, నేతలు అభినందిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంతో పాటు, జిల్లాకే గర్వకారణమని పలువురు కొనియాడుతున్నారు. ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ రామరాజు కృషిని అభినందించారు. దేశానికి సేవ చేసే అవకాశం రావడం గొప్ప వరమని ఆశీర్వదించినట్లు రామరాజు వెల్లడించారు. దీంతో తల్లి దండ్రులు నాగేశ్వరరావు, ఈశ్వరమ్మతో పాటు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలకు స్వాంతన

- రాజముద్రతో పాసు పుస్తకం
- జిల్లాకు చేరిన 1.5 లక్షల పాసు పుస్తకాలు



కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బొమ్మతో రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో ఎవరి బొమ్మలు లేకుండా రాజముద్రతో ఎటువంటి లోపాలు లేకుండా రైతులకు స్వాంతన చేకూర్చే విధంగా పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వంలో వారసత్వంగా, కష్టపడి సంపాదించి కొనుగోలు చేసిన భూములపై నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బొమ్మతో ముద్రించిన పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. దీనిపై రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లను చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తప్పులతడకగా మారిన భూసర్వేను మళ్లీ గాడిన పెట్టేందుకు రైతుల పొలాలకు సంబంధించి సరైన హద్దులతో పాసు పుస్తకాలు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రాజముద్రతో పాసు పుస్తకాలను పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. ఈ తరహా పాసు పుస్తకాలు అందించేందుకు ఆగస్టు 31 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. కర్నూలు జిల్లాకు 1.05లక్షలు పాసు పుస్తకాలు విడుదల చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఈపాసు పుస్తకాల్లో ఇంకా ఏమైనా తప్పు ఒప్పులు ఉన్నాయేమోనని వారం రోజులుగా మండల కేంద్రాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో వీఆర్వోలు, తహసీల్దార్లు, ఆర్ఐలు సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. గ్రామాల వారీగా తహసీల్దార్ల ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేసి పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తారు.

దరఖాస్తుకు గడువు పెంపు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతికి దరఖాస్తు చేసుకునే గడువును పొడగించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు 13వ తేదీ వరకు ఉన్న గడువును ఆగస్టు 27వ తేదీ వరకు పొడగించారని చెప్పారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జవహర్ నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

'వ్యాపారవేత్తగా ఎదగాలి'



మాట్లాతున్న జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం జవహర్ బాబు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం నుంచి ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జవహర్ బాబు తెలిపారు. బుధవారం కార్యాలయంలో పరిశ్రమల ప్రతినిధులతో ఉద్యం పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమకు నైపుణ్యం కలిగిన రంగంలో వృద్ధి చెందాలని, ఇందుకు సంబంధించి వారి పేర్లను ఉద్యంలో నమోదు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ పథకాల పరంగా వెసులుబాటు, బ్యాంక్ రుణాలు, వడ్డీ రాయితీ వంటి ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. ఉద్యంలో పేర్ల నమోదు ఉచితంగా చేస్తారని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జవహర్‌బాబు సూచించారు. కార్యక్రమంలో ఐపీవోలు డానియేలు, హరిహరరెడ్డి, నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

5వ పేజీ తరువాయి

ఈఘటనపై మృతురాలి తల్లి శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందికొట్కూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈఘటనపై ఆర్ఎంపీ గీతారాణి, రక్ష హాస్పిటల్ స్కానింగ్ టెక్నీషియన్ శేఖర్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌పై కేసు నమోదు చేశారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాల నిర్వహణ గాడి తప్పింది. యథేచ్ఛగా స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ చేస్తున్న అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు. ఉమ్మడి

- రెండు నెలల క్రితం కర్నూలుకి చెందిన తల్లి, కూతురు, కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసుకు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. తమకు నగరంలోని ధర్మపేటలోని చల్లా కాంపౌండులో కూతురుకు అనర్హులు అబార్షన్ చేశారంటూ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు.
- నెలరోజుల క్రితం కర్నూలు నడిబొడ్డున ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయాగ్నస్టిక్ బ్లాక్ వద్ద మృతి చెందిన ఓ మృత శిశువును కొందరు ఖాళీ స్థలంలో పడేసి వెళ్లారు. శిశువుకు చీమలు పట్టాయి.
- జూలై 29న నందికొట్కూరు పాతబస్టాండులో ఓ ఆర్ఎంపీ క్లినిక్‌లో మూడో కాన్పు కోసం వచ్చిన గర్భిణికి ఆడశిశువు అని నిర్ధారణ చేసి ఎంటీపీ (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) చేశారు. ఆమె మరణించింది. కర్నూలు రక్ష హాస్పిటల్‌లో గర్భిణికి లింగనిర్ధారణ చేశారు.

జిల్లాలో ఈమూడు ఘటనలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్కానింగ్ కేంద్రాలు భ్రూణ హత్యలకు పాల్పడుతున్నాయి.

కలెక్టర్ గారూ.. డెకాయ్ ఆపరేషన్లు ఏమయ్యాయి?

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, కోడుమూరు, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో కొందరు అనుమతులు లేకుండా స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ చేస్తూ ఆడపిల్లలను చంపేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 2012లో అప్పటి డీఎంహెచ్‌వో డా.వై.నరసింహులు, ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ సిబ్బంది 13 స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి సీజ్ చేశారు. ఆ తర్వాత జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు స్కానింగ్ కేంద్రాల జోలికి వెళ్లలేదు. వైద్యఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇక లాభం లేదనుకున్న జిల్లా విజిలెన్స్ అధికారులు 2016లో డెకాయ్ ఆపరేషన్, దాడులు నిర్వహించి కర్నూలులోని ఎన్ఆర్‌పేటలో ఓఆర్ఎంపీ, స్కానింగ్ కేంద్రం, కొత్తబస్టాండు సమీపంలోని జేబీ హాస్పిటల్, అమ్మ హాస్పిటల్, గూడూరు, ఆదోనిలో ఓహాస్పిటల్‌పై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి కేసులు పెట్టారు. 2012 తర్వాత ఇప్పటి వరకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గానీ, డెమో అధికారులు ఒక డెకాయ్ ఆపరేషన్ కూడా నిర్వహించిన దాఖలాలు లేవు. కలెక్టర్ అనుమతితో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలి. ఇందులో ఎన్‌జీవోలు తప్పక ఉండాలి. డెమో విభాగం తమ గదులకే పరిమితమయ్యారు.

నామమాత్రంగా పీసీపీఎన్‌డీటీ సెల్

భ్రూణహత్యలను అరికట్టేందుకు ఉమ్మడి జిల్లా వైద్యఆరోగ్య శాఖలో పీసీపీఎన్‌డీటీ (ప్రీ కాన్సెప్షన్ ప్రీనేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్) సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెల్ కొద్ది రోజులుగా స్తబ్దుగా ఉంది. డెమో విభాగం నిర్వహిస్తుంది. పీసీపీఎన్‌డీటీ సెల్‌కు నోడల్ ఆఫీసర్‌గా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వ్యవహరిస్తారు. స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్, ఫారం-ఎఫ్, బాల్యవివాహాలు, భ్రూణహత్యలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. లింగ నిర్ధారణ గురించి, ఆడపిల్లల ప్రాధాన్యత గురించి చట్టం గురించి, కౌమార బాలికలకు, కాలేజీ విద్యార్థులకు, మత పెద్దలతో సమావేశాలు నిర్వహించాలి. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. పీసీపీఎన్‌డీటీ, డెమో విభాగాలు కేవలం స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌కే పరిమితమయ్యారు. జిల్లాలో ఆడశిశువులను ముళ్ల కంపలో పడేస్తున్నారు. ఆడపిల్లలు కడుపులో ఉన్నారని, లింగ నిర్ధారణ చేసి అబార్షన్‌లు చేస్తున్న ఘటనలు జరుగుతున్నా ఏమాత్రం పట్టించు కోవడం లేదు.

చిదిమేస్తున్నారు...!



ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ..

ఉమ్మడి జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జోరుగా సాగుతున్నాయి. కొందరు అనర్హులు, ఆర్ఎంపీలు, కొందరు వైద్యులు కాసుల కక్కుర్తితో ఎంతోమంది పసిప్రాణాలను తుం చేస్తున్నారు. లింగనిర్ధారణలో ఆడపిల్ల అని తేలితే కొంతమంది తల్లిదండ్రులు ఆడ పిల్లలను భారంగా బావించి ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే ఆసరాగా ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడపిల్లలను ఈలోకంలోకి అడుగు పెట్టకుండా చేస్తున్నారు. ఇటీవల పగిడ్యాల మండలం బీరవోలుకు చెందిన మహిళ మూడోసారి గర్భం దాల్చింది. అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడోసారి కూడా అనుమానం వచ్చి కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లో స్కానింగ్ చేయించారు. అక్కడ ఆడబిడ్డ ఉన్నట్లు నిర్ధారణ చేసుకుని నందికొట్కూరులో అబార్షన్ చేయించారు. ఇలా గర్భస్రావం చేయించుకున్న గర్భిణులు చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లాలో గర్భస్థ శిశు పరీక్షలకు సంబంధించి 372 స్కానింగ్ కేంద్రాలకు అనుమతి ఉంది.

బీరవోలు ఘటనపై భిన్న వాదనలు

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం బీరవోలులో ఓగర్భిణికి ఆర్ఎంపీ అబార్షన్ చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి మృతి చెందింది. దీనిపై పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ మధ్య భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. మూడోసారి గర్భందాల్చిన ఆమెను కుటుంబ సభ్యులు నందికొట్కూరులోని ఓఆర్ఎంపీని సంప్రదించి అబార్షన్ చేయించగా అది వికటించి మృతిచెందింది. ఆ తర్వాత ఆమహిళకు ఎక్కడ లింగ నిర్ధారణ చేశార్న విషయం తెరమీదకు వచ్చింది. కర్నూలు రక్ష హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ చేశారని, అక్కడ ఆడ శిశువు అని నిర్ధారించినట్లు విచారణలో తేలినట్లు నందికొట్కూరు రూరల్ పోలీసులు కేసులు పెట్టారు. మరో పక్క లింగనిర్ధారణపై వచ్చిన ఆరోపణలపై రక్ష హాస్పిటల్‌కు కర్నూలు డీఎంహెచ్‌వో రెండు షోకాజ్ నోటీసులు జారీచేశారు. దీంతో రక్ష హాస్పిటల్ యాజమాన్యం వచ్చి స్కానింగ్ కేంద్రానికి అనుమతులు ఉన్నాయని, స్కానింగ్ పరీక్షలు తాము చేయలేదని, యంత్రం చెడిపోయిందని, కండిషన్‌లో లేదని వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంతో రక్ష హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ చేశారాని కుటుంబసభ్యులు చెప్పిన విషయం నిజమా? స్కానింగ్ మిషన్ పనిచేయడం లేదని లింగనిర్ధారణ చేయలేదని రక్ష హాస్పిటల్ యాజమాన్యం చెప్పిన విషయం వాస్తవమా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇరు వర్గాల వాదనలు వేర్వేరుగా ఉండటంతో గందరగోళం నెలకొంది.

జిల్లా మల్టీ నెంబరులో కలెక్టర్, ఎస్పీ, న్యాయాధికారి

జిల్లాలో భ్రూణహత్యల నివారణ కోసం పీసీపీఎన్‌డీఈ యాక్టు అమలులో జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఎంతో కీలకమైంది. ఈకమిటీకి చైర్మన్ కలెక్టర్ వ్యవహ రిస్తారు. సభ్యులుగా జిల్లా న్యాయాధికారి, ఎస్పీ, డీఎంహెచ్‌వో, ఎన్‌జీవోలు ఉంటారు. ఈకమిటీ స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయడం, రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయడం, లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై దాడులుచేయాలి. తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సీజ్ చేయాలి. లింగ నిర్ధారణ ఆడ పిల్లల ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. కర్నూలు జిల్లాలో మాత్రం జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ నామమాత్రంగా పని చేస్తుంది. స్కానింగ్ కేంద్రాల తనిఖీలకు పీసీపీఎన్‌డీఈ సెల్ నోడల్ అధికారి, డోమో, లీగల్ కన్సల్టెంట్‌లు మాత్రమే వెళ్తున్నారు. ఎక్కడ ఎన్జీవోలను తనిఖీలకు తీసుకెళ్లడం లేదు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విధిగా నెలలో పది శాతం స్కానింగ్ కేంద్రాలను తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వాటిని సీజ్ చేయాలి.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే మూడేళ్లు జైలు

ఏటా ఆడపిల్లలు సంతతి తగ్గిపోతుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం పీసీపీఎన్‌డీటీ, యాక్టు 1994చట్టం అమలులోకి తెచ్చింది. ఈచట్టాన్ని అతిక్రమిస్తే ఎలాంటి శిక్షలు ఉంటారో తెలుసుకుందాం.

- గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం 1994 ప్రకారం నిబంధనలు 1996 ప్రకారం గర్భస్థ పిండ నిర్ధారణ నేరం
- గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా ఇందుకు ప్రోత్సహించిన వారికి చట్టం ప్రకారం రూ.10వేలు జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధించొచ్చు.
- గుట్టచప్పుడు కాకుండా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడుతున్న వైద్యులు స్కానింగ్ కేంద్రాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి పిర్యాదు చేయవచ్చు. అలాంటి కేంద్రాలపై అధికారులు దాడులుచేసి చట్టప్రకారం శిక్షించేందుకు ప్రభుత్వం నివేదిస్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. వివరాలివీ.. ఆదోని పట్టణానికి చెందిన ఎరుకల లక్ష్మన్న(28) ఎమ్మిగనూరు పట్టణంలో తమ బంధువుల పెళ్లి కోసం వచ్చారు. అయితే పెళ్లి ముగించుకొని బైకుపై ఆదోనికి వెళ్తుండగా కొటేకల్లు గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి చెట్టుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. లక్ష్మన్న భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రూ.5 లక్షల అపహరణ



బాధితుడు గోపాల్ రెడ్డి

ఆలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో డబ్బు డ్రా చేసుకుని వెళుతున్న బాధితుడిని గమనించిన దుండగులు రూ.5లక్షలను అపహరించుకుని పోయారు. బాధితుడి కథనం మేరకు.. హాలహర్వి మండలం మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి ఆలూరులోని స్టేట్ బ్యాంక్ నుంచి రూ.5 లక్షలు డ్రా చేసుకుని బైకులో గ్రామానికి వెళుతున్నాడు. దారి మధ్యలో మూత్ర విసర్జన కోసం బండి పక్కన పెట్టి వెళ్లాడు. బాధితుడిని గమనించి వెంబడించిన దుండగులు సినీ ఫక్కీలో రూ.5 లక్షలు అపహరించుకు పోయారు. తిరిగి వచ్చిన బాధితుడు బండలో డబ్బులు లేకపోవడాన్ని గమనించి లబోదిబోమంటూ ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కుందూ నదిలో పడి దివ్యాంగుడి మృతి

బండి ఆత్మకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నివాసం ఉంటున్న రమణారెడ్డి (58) అనే దివ్యాంగుడి కుందూనదిలో పడి మృతి చెందారు. లింగాపురం గ్రామం నుంచి రమణారెడ్డి సుమారు 20 ఏళ్ల క్రితం భార్య పిల్లలతో బండిఆత్మకూరుకు వచ్చారు. కొంత కాలం తరువాత భార్య ఇద్దరు కూతుళ్లతో కలిసి గని గ్రామంలో ఉంటున్నారు. అప్పటి నుంచి రమణారెడ్డి ఒక్కడే ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం బండిఆత్మకూరు కుందూనది వంతెనపై నుంచి తన ట్రై సైకిల్‌తో సహా కుందూనదిలో పడిపోయారు. పోలీసులు గాలింపు చేపట్టి సాయంత్రం నంద్యాల నందమూరినగర్ రహదారిలోని కుందూ వంతెన వద్ద ఈతగాళ్ల సహాయంతో రమణారెడ్డి మృతదేహాన్ని వెలికితీశారు. రమణారెడ్డి కూతురు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అక్బర్ తెలిపారు.



రమణారెడ్డి (ఫైల్)

రైలు ఢీకొని వృద్ధురాలు..

నంద్యాల టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొగ్గులైన్‌కు చెందిన వృద్ధురాలు వెంకటమ్మ (85) రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ కుమారి తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివీ.. మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో కాచిగూడ రైలు ఢీకొట్టింది. దీంతో గమనించిన బంధువులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారి పడి మరొకరు..

నంద్యాల రైల్వే స్టేషన్ పరిధిలోని గుడిమెట్ట వద్ద రైలు నుంచి జారి పడి మద్దయ్య (42) దుర్మరణం చెందారు. రైల్వే ఎస్ఐ కుమారి తెలిపిన వివరాలివీ.. కర్నూలు జిల్లా లక్ష్మీపురానికి చెందిన మద్దయ్య 11వ తేదీన కర్నూలు నుంచి విజయవాడకు అమ్మవారి దర్శనార్థం వెళ్లారు. అయితే తిరిగి వచ్చే సమయంలో మంగళవారం గుంటూరు-డోన్ రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

నంద్యాల టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ యువకుడు నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ కుమారి తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివీ.. గడివేముల మండలం కొర్రపోలూరుకు చెందిన సూర్య (23) డిగ్రీ పూర్తి చేసుకుని హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఒక యువతిని ఏడాదిగా ప్రేమిస్తున్నాడు. అయితే సూర్య ప్రేమిస్తున్న యువతికి నిశ్చితార్థం అయింది. దీంతో మనస్థాపం చెందిన సూర్య కవులూరు వద్ద ఈనెల 11న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య

కర్నూలు క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన నిస్సార్ (24) అనే హిజ్రా (ట్రాన్స్ జెండర్) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన కటిక నిసార్ పూర్తిస్థాయిలో ట్రాన్స్‌జెండర్ (లింగమార్పిడి ఆపరేషన్ కోసం)గా మారేందుకు తన తండ్రిని డబ్బులు అడిగాడు. తండ్రి నిరాకరించడంతో నిసార్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. క్షణికావేశంలో ఇంట్లో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువులు నిసార్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

ఎస్‌బీఐ మేనేజర్‌పై కర్రలతో దాడి

- ఇద్దరిపై కేసు నమోదు



బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్

ఆలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామ స్టేట్ బ్యాంక్ ఆఫ్ మేనేజర్ హరిప్రసాద్‌పై దాడి చేశారు. దీంతో ఆయన ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. వివరాలివీ.. మొలగవల్లి గ్రామానికి చెందిన మహిళ గత నెల అదృశ్యమైనట్లు ఆలూరు పోలీస్ స్టేషన్‌లో ఆమె బంధువులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు అయింది. అయితే మహిళ అదృశ్యం వెనుక బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ ప్రమేయం ఉందన్న అనుమానంతో ఈనెల 12న వాహనంలో గుంతకల్లు, ఆలూరుకు తీసుకెళ్లి కర్రలతో దాడి చేశారు. అనంతరం ఇంటి వద్ద బుధవారం తెల్లవారుజామున ఇంటి వద్ద వదిలివెళ్లారు. గుంతకల్లు మండలం బుగ్గసంగాలకు చెందిన జీవన్ కుమార్, మొలగవల్లి గ్రామంలో అదృశ్యమైన మహిళ సోదరుడు దస్తగిరి తనపై దాడి చేసి రూ.కోటి డబ్బులు ఇవ్వాలని బెదిరించినట్లు మేనేజర్ హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీవన్‌కుమార్, దస్తగిరిపై కిడ్నాప్, దాడి చేసినట్లు కేసు నమోదు చేశామని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం హెచ్చరించారు. వారం రోజుల క్రితం ప్రారంభమైన నేను ట్రాఫిక్ మిత్రకు మంచి స్పందన లభించింది. వివిద ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలపై రాంగ్ పార్కింగ్, రాంగ్ రూట్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై 19 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఎవరైనా ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే పోలీస్ వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 7777877722కు ఫొటోలు, వీడియోలు తీసి పంపించాలన్నారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన వారిని కౌన్సెలింగ్ చేసి జరిమానాలు విధిస్తామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

తెగుళ్లతో జాగ్రత్త

- అధిక వర్షాలతో నీటిలోనే పంటలు
- వేరుకుళ్లు తెగుళ్లు సోకే ప్రమాదం
- యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



ఆదోని మండలం ధణాపురం గ్రామం వద్ద నీట మునిగిన పత్తి పంట

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల పంటలు ముంపునకు గురయ్యాయి. ఆదోని డివిజన్‌లో అధికంగా పత్తి, వేరుశనగ, మిరప, వరి, జొన్న సజ్జ, కంది పంటలు సాగయ్యాయి. నల్లరేగడి పొలాలలో సాగైన పంటలు అధికంగా నీరు నిల్వ ఉండడం వల్ల దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక తేమ శాతం వల్ల పూత, కాయ రాలటం, పంట పెరుగుదల కుంటుపడడంతో పాటు దిగుబడులు తగ్గి, పంట నాణ్యత కూడా లోపిస్తుంది. వర్షాల వల్ల ముంపునకు గురైన పంటల్లో యాజమాన్య పద్ధతులను పాటిస్తే నష్టాన్ని నివారించవచ్చని ఆదోని ఏడీఏ బాలవర్ధిని రాజు తెలిపారు. ఆదోని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆదోని, కౌతాళం పెద్దకడబూరు, కోసిగి మండలాల్లో 89,127 హెక్టార్లలో వివిధ పంటలు సాగాయి. గత వారం రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో వర్షపు నీరు చేరి తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. పొలాల్లో ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటికి పంపాలి. నేల కోతకు గురికాకుండా పంటలను వాలుకు అడ్డంగా నాటుకోవాలి.

పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పత్తి పంటలో వర్షపు నీరు నిలబడితే పూత, పిందె, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబడి వాడిపోతాయి. పొలంలో నిలబడి ఉన్న నీటిని తీసి వేయాలి. ఎకరాకు 25-30 కిలోల యూరియా, 10-15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనంగా వేయాలి. వాతావరణం అనుకూలించిన వెంటనే పలుమార్లు అంతర కృషి చేయాలి. వర్షం తెరపిచ్చాక అవసరాన్ని బట్టి పొటాషియం నైట్రేట్ 2% (20గ్రా..లీ.) నీటికి కలిపి ఏడు నుంచి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పత్తిలో కాయ కుళ్లు తెగులు, ఆకు మచ్చ వ్యాధులను నివారించడానికి 3గ్రా. కాఫర్ ఆక్సీక్లోరైడ్‌ని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

యాజమాన్య పద్ధతులతోనే నివారణ



అధిక వర్షాలతో అక్కడక్కడ పొలాలలో నీరు నిల్వ ఉంటుంది. రైతులు వెంటనే ఆ నీటిని కాలువల ద్వారా బయటికి పంపించే ఏర్పాటు చేయాలి. తెగుళ్లు, పురుగు శోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యాజమాన్య పద్ధతులను అనుసరించి వ్యవసాయ అధికారుల సూచనలతో మందులను పిచికారీ చేస్తే నష్టాన్ని నివారించుకోవచ్చు. **- బాలవర్ధిని రాజు, ఏడీఏ, ఆదోని**

వేరుశనగ పంటలో..



పొలంలో నిలకడగా ఉన్న ముంపు నీటినీ వీలైనంత త్వరగా మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలి. వేరుశనగ పంట 20 నుంచి 25రోజుల వయసు ఉన్నట్లయితే ఎకరాకు ఇమజితాపిర్ 10% ఎస్ఎల్ 25 మి.లీ. కలుపు మందును 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఇనుము ధాతులోపం గుర్తించచినట్లయితే లోపాన్ని సవరించడానికిపై పాటుగా 5 గ్రా. అన్నబేది మరియు 1గ్రా..సిట్రిక్ ఆమ్లాన్ని లీటరు నీటికి చొప్పున కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

వరిలో..



నారు మడి గానీ, నేరుగా విత్తిన వరి పంటలో నీరు బయటకి పోవడానికి చర్యలు తీసుకోవాలి. సెంటు నారుమడికి అర కిలో యూరియా, పావు కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేయాలి.

'భవనాశి' ఉగ్రరూపం

- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- మునిగిన పొలాలు, ఇటుక బట్టీలు
- క్రస్టుగేట్ల ద్వారా 1000 క్యూసెక్కుల నీటి విడుదల



వరద రాజస్వామి ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల



ఆత్మకూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న పడేవాగు

ఆత్మకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ప్రవహిస్తున్న భవనాశి నది ఉగ్రరూపం దాల్చింది. ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి అధికంగా వర్షపాతం నమోదు కానప్పటికీ నల్లమలలో కురిసిన భారీ వర్షాలతో భవనాశి ఉధృతంగా ప్రవహించింది. దీనికితోడు వరద రాజ స్వామి ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో ఆత్మకూరు పట్టణం నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నది పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు, ఇటుకల బట్టీలు కూడా నీట మునిగాయి. భవనాశి సమీపంలోనే ఉన్న పడేవాగులో కూడా నీటి ప్రవాహం కొనసాగింది. బుధ వారం ఉదయం వరద ఉధృతి లేనప్పటికీ సాయంత్రానికి వంతెనపై నీటి ప్రవాహం ఉండటంతో రాకపోకలు కొనసాగించినలేని పరిసితి. ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో ఉమర్, రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నారాయణరెడ్డి భవనాశి ఉధృతిని పరిశీలించి ఎలాంటి రాకపోకలు జరగకుండా చర్యలు చేపట్టారు.

వీఆర్ఎస్పీలో ప్రస్తుతం 369.5 అడుగుల నీటి నిల్వలు

నల్లమలలో కురిసిన భారీ వర్షంతో ఆత్మకూరు మండలంలోని వరద రాజ స్వామి ప్రాజెక్ట్(వీఆర్ఎస్పీ)లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 370మీటర్లకు గానూ ప్రస్తుతం 369.5 అడుగుల మేర నీటినిల్వలు ఉన్నాయి. అదేక్రమంలో ప్రాజెక్ట్‌లో గరిష్ట స్థాయిలో 0.38 టీఎంసీల నీటి ఉండటంతో మునిమడుగుల వాగుకు రెండు క్రస్టుగేట్ల ద్వారా 1000 క్యూసెక్కుల నీటి విడుదల చేపడుతున్నారు. ఆయకట్టు పంటలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా నీటి విడుదల కొనసాగిస్తున్నారు.



భవనాశి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- కేఎంసీ ప్రిన్సిపాల్
- మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వీక్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ హెచ్చరించారు. యాంటి ర్యాగింగ్ వీక్ సంబరంగా దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలో యూజీసీ, నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు కర్నూలు మెడికల్ కాలేజీలో జూమ్‌లో ర్యాగింగ్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా యాంటి ర్యాగింగ్‌పై ఎన్ఎంసీ చైర్మన్ డా.అబిజిత్ సేత్ ప్రతిజ్ఞ చేయించారు. ఆగస్టు 12 నుంచి 18 వరకు యాంటి ర్యాగింగ్ వారోత్సవాలు నిర్వహించాలని ప్రిన్సిపల్ తెలిపారు. ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను చట్టం ద్వారా తీసుకునే కఠినమైన చర్యల గురించి విద్యార్థులకు వివరించాలన్నారు. వారోతసవాల సందర్భంగా డిజిటల్ పోస్టర్లు, షార్ట్ వీడియోలు, యాంటి ర్యాగింగ్ సందేహాలను హైలెట్ చేసే రీల్స్‌పై దృష్టి పెట్టాలన్నారు. ర్యాగింగ్ వ్యతిరేక సందేహాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను వినియోగించుకోవాలన్నారు.జూమ్ మీటింగ్‌లో వైస్ ప్రిన్సిపల్ డా.హరిచరణ్, డా.సాయిసుధీర్, డా.రేణుకాదేవి, డా.సింధియా శుభప్రద, యాంటి ర్యాగింగ్ సభ్యులు హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, పీజీలు, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పరిరక్షించాలి

- ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్

కర్నూలు న్యూసిటీ/కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని పరిక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్‌జీ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం సందర్భంగా బుధవార నగరంలోని సీఆర్ భవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దేశంలో శాస్త్రీయ విద్యావిధానం అమలు కావాలని, అందరికీ సమాన హక్కులు కల్పించాలని కోరారు. అందరూ చదువుకోవడానికి అవకాశాలు ఏర్పాటు చేయాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానం వల్ల విద్యా వ్యవస్థ నాశనం అవుతుందన్నారు. విద్యావిదానంలో సంస్కరణలు కావాలి గానీ, విద్యావ్యవస్థ నాశనం అయ్యే నిర్ణయాలు తీసుకోకూడదని తెలిపారు. దేశంలో మెడికల్ వ్యవస్థ పూర్తి స్థాయిలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అందకుండా ఈ ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని మండిపడ్డారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా 30 మంది ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, శాబీర్‌బాషా, జిల్లా ఆఫీస్ బేరర్స్ రంగస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం 'మండల గ్రీవెన్స్'

- ఈనెల 22 నుంచి ప్రారంభం
- హాజరుకానున్న జేసీ, సబ్ కలెక్టర్, ఆర్డీవో, జిల్లా రెవెన్యూ అధికారులు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల భూముల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో ప్రతి శుక్రవారం ఒక మండలంలో గ్రీవెన్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా రెవెన్యూ శాఖాధికారులు బుధవారం తెలిపారు. ఈ మేరకు 22నుంచి మండల గ్రీవెన్స్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ గ్రీవెన్స్‌కు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవో అధికారులు హాజరు కానున్నారు. ప్రతి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రైతుల నుంచి అర్జీలను అధికారులు స్వీకరించనున్నారు. రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని వారు పేర్కొన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి సంబంధించి వీఆర్వో, గ్రామ సర్వేయర్, మండల సర్వేయర్, మండల తహసీల్దార్, గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ నెల 22న సి.బెళగల్, 29న ఆలూరారు, సెప్టెంబరు నెలకు సంబంధించి 12న గోనెగండ్ల, 19న వెల్దుర్తి, అక్టోబరు 3న హాలహర్వి, 10న పెద్దకడుబూరు, 17న కోడుమూరు, 24న దేవనకొండ, 31న మంత్రాలయం, 14న తుగ్గలి, 21న కౌతాళం, 28న కల్లూరు, డిసెంబరు 5న క్రిష్ణగిరి, 12న హోళగుంద, 19న ఓర్వకల్లు, 16న మద్దికెర, 2026 సంవత్సరం జనవరిలో 2వ తేదీ నందవరం, 9న కర్నూలు రూరల్; 23న చిప్పగిరి, 30న ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 6న కర్నూలు అర్బన్, 13న పత్తికొండ, 20న కోసిగి, 27న ఆస్పరి, మార్చి 3న ఆదోని మండలంలో గ్రీవెన్స్ కార్యక్రమం జరగనుంది.

రైతులకు ఉపయోగం



రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటుచేయడం రైతులకు ఎంతో ఉపయోగకరం. ప్రతి సోమవారం భూ సమస్యల పరిష్కారం కోం జిల్లా కేంద్రానికి రావాలంటే రైతులకు ఆర్థికపరంగా కొంత ఇబ్బందిగా ఉంది. ప్రతి మండలంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయడంతో భూసమస్యలు పరిష్కారం అవుతాయి. **- యోగేష్, జాతీయ లంబాడీ సంఘం కార్యదర్శి,**

ఫిర్యాదు ధృవీకరణ పత్రమివ్వాలి



జగనన్న భూసర్వేలో అనేక తప్పులు దొర్లాయి. దీంతో రైతులకు భూ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ప్రతి మండలంలో శుక్రవారం భూ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ ఏర్పాటుచేయడంతో రైతుల సమస్యలను రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పరిష్కారం అవుతాయి. ఈసారైనా రైతులకు ఫిర్యాదు ధృవీకరణ పత్రం ఇవ్వాలని సూచించారు. **- భాస్కర్, సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ**

మెరుగైన పారిశుధ్యానికి ప్రణాళికలు: కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో మెరుగైన పారిశుధ్యానికి వార్డు స్థాయిలో ప్రణాళికలు రూపొందించుకుని, అధికారుల సమన్వయంతో అమలు చేయాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. బుధవారం స్థానిక నగర పాలక సమావేశ భవనంలో పారిశుధ్య, ఇంజనీరింగ్, నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్ర నోడల్ అధికారి ఉదయ్ సింగ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని, పూడికతీత పనులు, చెత్తకుప్పల తొలగింపు కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీలోనే కార్యకర్తలకు న్యాయం



ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే కార్య కర్తలకు న్యాయం జరుగుతుందని టీడీపీ నాయకుడు, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ దండు సుందరరాజు అన్నారు. బుధవారం కర్నూలులోని పార్టీ కార్యాలయంలో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఆకెపోగు ప్రభాకర్‌ను గూడూరు మండల టీడీపీ నాయకులు, దండు సుందరరాజు, పెంచికల పాడు మాజీ ఎంపీటీసీ కె.కృష్ణ, హలీఫ్ బాషా పూలమాలలతో సన్మానించారు. దండు సుందరరాజు మాట్లాడుతూ టీడీపీ అభ్యున్నతికి ఆకెపోగు ప్రభాకర్ ఎంతో కృషి చేశారని, అందుకు పార్టీ అధినేత, సీఎం చంద్ర బాబు, మంత్రి నారా లోకేశ్ గుర్తించి చైర్మన్ పదవిని ఇచ్చారన్నారు. అం దుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

కోడుమూరు రూరల్: ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్‌ను అమడగుంట్ల టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, రాజు, మాదన్నలు కలిసి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సుంకన్న, ఉప సర్పంచ్ మోదీన్‌బాష, చెన్నారెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

ఘనంగా 'మల్లెల' జన్మదిన వేడుకలు



హుశేనాపురంలో కేక్ కట్ చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామంలో బుధవారం నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులుకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.13,900 వేతనం ఇవ్వాలి



సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప

కర్నూలు హస్పిటల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వ జన వైద్యశాలలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు అగ్రిమెంటు ప్రకారం ఈగల్ హంటర్ సెక్యూరిటీ ఏజెన్సీ పీఎఫ్, ఈఎస్ఐ పోనూ ఒక్కొక్కరికి రూ.13,900 వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప ఏజెన్సీ ప్రతినిధులను కోరారు. బుధవారం ఆయన సెక్యూరిటీ ఆఫీసుకు వెళ్లి వేతనాల గురించి మాట్లాడారు. హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డులకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని, జూన్ నెలలో రూ.12,100 వేతనం ఇచ్చారని, ఎంవోయూ, అగ్రిమెంటు ప్రకారం సెక్యూరిటీ గార్డులకు పీఎఫ్, ఈఎస్ఐతో కలిసి రూ.18,600 వేతనం ఇవ్వాలని ఈ విషయంపై ఈగల్ ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు రెండుసార్లు లెటర్లు రాశానన్నారు. సెక్యూరిటీ గార్డులకు వేతనం రూ.13,900 ఇవ్వాలని లేదంటే లేబర్‌కోర్టుకు వెళ్తామన్నారు. అలాగే వారంతపు సెలవులు నాలుగు ఇవ్వాలన్నారు.

మానవత్వం చాటుకున్న అశోకా మహిళా కళాశాల చైర్మన్

కల్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్‌వర్ధన్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం రాత్రి 11 గంటల సమ యంలో పెద్దటేకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో పెళ్లి ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో 10 మందికి పైగా తీవ్రగాయాల య్యాయి. చిన్నటేకూరులోని అశోకా క్యాంపస్ నుంచి అదే సమయంలో అటుగా వెళ్తున్న అశోకా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్‌వర్ధన్‌రెడ్డి తీవ్రం గా గాయపడిన ఐదుగురిని తన వాహనంలో ఎక్కించుకుని ప్రభుత్వ ఆస్పత్రి క్యాజు వాలిటీ వార్డునకు తరలించి ఉదారత చాటుకున్నారు. పెళ్లి బృందం వారంతా చిన్నటేకూరు గ్రామా నికి చెందిన వారుగా గుర్తించారు. ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తరలించడంతో వారికి ప్రాణాపాయం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

సొసైటీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

సి.బెళగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సి.బెళగల్‌లో సొసైటీ భవన నిర్మాణానికి స్థలాన్ని సింగిల్ విండో ప్రెసిడెంట్ డాక్టర్ తిమ్మప్ప బుధవారం పరిశీలించారు. తిమ్మప్ప మాట్లాడుతూ మండలంలోని సొసైటీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా వాటి వద్ద కంచె ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయన సెక్రటరీలు రవిరెడ్డి, ఖాజ ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం ధ్యేయం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- ట్రాక్టర్, ఎద్దులబండ్లపై 'అన్నదాత సుఖీభవ'కు కృతజ్ఞత ర్యాలీ
- రైతుల నుంచి విశేష స్పందన
- ఎమ్మెల్యేను సన్మానించిన మహిళలు



హుశేనాపురంలో ఎద్దుల బండి పై ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మల్లెల రాజశేఖర్



ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి

ఓర్వకల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమం, అభివృద్దే సీఎం ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్‌తో కలిసి అన్నదాత సుఖీభవ పథకానికి కృతజ్ఞతగా హుశేనాపురం గ్రామంలో ట్రాక్టర్లు, ఎద్దులబండ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జాతీయ రహదారి నుంచి సంత మార్కెట్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీకి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.90లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు అనంతరం పొదుపులక్ష్మి కార్యాలయానికి వెళ్లి పొదుపు మహిళలతో ముచ్చటించారు. మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనం కొనుగోలు నుంచి పంట విక్రయం వరకు రైతులకు అండగా ప్రభుత్వం ఉందన్నారు. ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారని అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కనీసం రైతులకు గోనెసంచులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతులకు అండగా చంద్ర బాబు అర్హులైన ప్రతి రైతుకు రూ.20వేల సాయం అందిస్తున్నామని హామీ ఇచ్చి నిలబెట్టుకుంటున్నారన్నారు. సుంకేసుల, గోరుకల్లు రిజర్వాయరుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.3కోట్లు నిధులు మంజూరు చేస్తే వైసీపీ నాయకులు పర్సంటేజీల పేరుతో పనులు చేయలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.36 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. త్వరలో జరిగే సర్పంచు ఎన్నికల్లో పొదుపు మహిళలకు కేటాయించాలని ఎమ్మెల్యేను మల్లెల రాజశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగిరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో మధుమతి, జేఈ సురేంద్రనాథ్ రెడ్డి, ఎస్ఐ సునీల్ కుమార్, మాజీ సర్పంచ్ మల్లెల జ్యోతి, పాణ్యం మార్కెట్ యార్డు చైర్మన్ గీత, సొసైటీ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక : విష్ణు

సి.బెళగల్: రైతే దేశానికి వెన్నెముక లాంటివారని కేడీసీసీబీ చైర్మన్ ఎదురూర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం సి.బెళగల్‌లో టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అధ్యక్షతన అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరిలు హాజర య్యారు. ముందుగా మాజీ సీఎం దివంగత ఎన్టీఆర్, సీఎం చంద్ర బాబు చిత్రపటాలకు వారు క్షీరాభిషేకం చేశారు. అనంతరం సి.బెళగల్‌లో ఎండ్ల బండ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీబీ రాఘవరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ డాక్టర్ తిమ్మప్ప, ఎంపీటీసీ ఈరన్నగౌడు, హరి, భీమన్న, బాలజీ వెంకటేష్, గౌస్, విద్యా కమిటీ చైర్మన్లు వెంకటేశ్వర్లు, గోవిందు, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి, టీడీపీ మండల కన్వీనర్లు సురేష్, బుర్రా వెంకటేశ్వర్లు, రామకృష్ణరెడ్డి, రాంభూ పాల్‌రెడ్డి, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి: జేసీ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్నటువంటి అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని జాయింట్ కలెక్టర్ బి. నవ్య అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని సమావేశ భవనం లో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ స్కీంపై లైసెన్స్ ఇంజనీర్లు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ గతంలో ఎల్ఆర్ ఎస్ స్కీము లేకపోవడంతో ప్లాట్ల క్రమ బద్ధీకరణకు అనేక ఇబ్బందులు ఉండేవన్నారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, ఇప్పుడు 2025 జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఉంటుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ కోసం 90 రోజులు గడువు ఉంటుందని, ప్రతి ప్లాట్‌కి తప్పకుండా దర ఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్లాట్ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ చార్జీలు ఉంటాయన్నారు. 5, 10 శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే 14 శాతం అదనపు చార్జీలు విధిస్తారన్నారు. పాత దరఖాస్తులకు కూడా అవకాశం ఉంటుందని, దీనికి సంబంధించిన పోర్టల్ ఈనెల ఒకటి నుంచి అందు బాటులోకి వచ్చిందన్నారు. అనంతరం కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాట్లాడుతూ ముందుగా ఎల్ఆర్ఎస్ స్కీముపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవిషయంపై నగర పాలక అధికారులు ఆటోలు, బ్యానర్ల ద్వారా ఎల్ఆర్‌స్కీం ప్రత్యేకతలను వివరించాలన్నారు. ఈ సమా వేశంలో నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ వై.వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించండి

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని పిఠాపురంలో ఈనెల 14 నుంచి 17వరకు జరిగే రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించాలని విష్ణుసేవ లీడర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. జట్టుకు ఆయన క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సూర్యప్రకాష్ రెడ్డి, వెంకటరెడ్డి, పీఈటీ ముస్తహీర్, సురేంద్ర, వలి, ఫరూక్, కృష్ణ యాదవ్, మధు బాబు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు బుధవారం ప్రారంభమ య్యాయి. ప్రాంతీయ కెనరా బ్యాంకు ఏజీఎం, సుశాంత్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు కలిసి పోటీలను ప్రారంభిం చారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సుందర్‌రాజ్, మాస్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఐఈవో సురేష్‌బాబు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. డీఐఈవో సురేష్‌బాబు, ఆర్ఐవో లాలెప్ప, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, డీఎస్పీ మహబూబ్ బాషాలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈర్యాలీ ఒకేషనల్ జూనియర్ కళాశాల నుంచి సి.క్యాంపు బిర్లా సర్కిల్ మీదుగా తిరిగి కళాశాల వరకు కొనసాగింది. కార్యక్రమంలో రాయపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు మల్లికార్జున, జబీన్ అక్తర్, సోమేష్, లక్ష్మి విద్యా ర్థులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో మండల స్థాయి అధికారులు, సర్పంచ్ హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడుతూ శుక్రవారం జరిగే స్వాతంత్ర్య వేడుకలకు అధికా రులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సర్పంచ్ పాండురంగన్న, మాజీ ఎంపీటీసీ ధనుజయుడు పాల్గొన్నారు.

సుద్దవాగుకు రక్షణ గోడ నిర్మించాలి



సుద్దవాగు నుంచి బయటికి పొంగి పొర్లుతున్న వరద నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని 22, 23, 24 వార్డుల్లో ప్రవహిస్తున్న సుద్దవాగుకు రక్షణ గోడ నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సుద్దవాగు పొంగిపొర్లు తుండటంతో బుధవారం సీపీఎం బృందం వాగును పరిశీలించారు. నరసింహులు మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు సుద్దవాగు పొంగి శ్రీరామ్ నగర్, లక్ష్మీనగర్ కాలనీలో జలమయమయ్యాయన్నారు. గణేష్ నగర్ నుంచి కేసీ కెనాల్ వెంట వెళ్లే వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. సుద్దవాగును విద్యార్థుల ఆటో దాటుతుండగా ప్రమాదం జరగడంతో స్థానికులు రక్షించారన్నారు. తక్షణమే సుద్దవాగుకు రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు అజ్మత్ శేఖర్, రాజు, అయ్యస్వామి, కొండయ్య పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. బుధవారం కేపీఎస్ కార్యాలయ ఆవరణలో తలసేమియా వ్యాధి గ్రస్తులకు మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రెండో పట్టణ సీఐ జి.నాగరాజరావు హాజరయ్యారు. ఈసందర్భంగా శ్రీహర్ష, సీఐ నాగరాజరావులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ఎప్పుడు ఉత్సాహంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు హరినాథ్ గౌడు, సీఎస్.శ్రీనివాసులు, మధు, రాఘవేంద్ర, నాగరాజు, భార్గవ్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట: ఎమ్మెల్యే

కల్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అర్హులైన లబ్ధిదారులకు రూ.15.1434 సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

రేపు మాంసం దుకాణాలు మూసివేయాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని కబేళాలు, మాంసం దుకాణాలను మూసివేయాలని నగర పాలక ఆరోగ్య ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతువులను వధించడం, విక్రయించడం నేరమన్నారు. అలాగే హోటళ్ల, రెస్టారెంట్లలో మాంసం అమ్మరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చటరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుట్టుచప్పుడు కాకుండా అమ్మిన వారిపై భారీ జరిమానా విధించడంతోపాటు వ్యాపార లైసెన్సు రద్దు చేస్తామన్నారు.

ఆగుతూ.. కదులుతూ

- విస్తరణ పేరుతో రోడ్డు నిర్మాణాల జాప్యం
- గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్
- వినాయక ఆలయం వద్ద అస్తవ్యస్తం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కర్నూలు అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): చిన్న వర్షం వచ్చిందంటే చాలు ఆ రోడ్డు గుండా ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. గంటల తరబడి ఆగి..ఆగి.. ప్రయాణం ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొంది. నగరంలోని నంద్యాల చౌరస్తా నుంచి నందికొట్కూరు వెళ్లే ప్రధాన రహదారిలోని వినాయక దేవాలయం వద్ద వర్షం నీటితో రోడ్డుపై వాహనాలు ఎక్కడికక్కడ గంటల తరబడి నిలిపోతుంటాయి. రోడ్డు విస్తరణ పేరుతో ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో కల్వర్టుకు మరమ్మతులు కూడా లేకుండా పోయాయి. ఫలితంగా రోడ్డుపై వంకలా నీరు ప్రవహించడంతో ప్రధాన రహదారి నీటి ప్రవాహంతో పూర్తిగా పాడైపోయింది. వాహనాలు గుంతల్లో పడి ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయి.. జూన్ నెలలో సీఎం చంద్రబాబు రాకతో తాత్కాలికంగా రోడ్డుపై నిర్మాణం చేపట్టినప్పటికీ చిన్నపాటి వర్షానికే అది కొట్టుకుపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అయిన రోడ్డు తీరు మారుతుందని కాలనీలవాసులు, వాహనదారులు ఆశించినప్పటికీ ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకుని అత్యవసరంగా ప్యాచ్ వర్క్‌లు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



వినాయక ఆలయం వద్ద రోడ్డు దుస్థితి

రాజ్‌విహార్ బస్టాప్ లోపలి వైపు..

రాజ్‌విహార్ బస్టాప్ లోపలివైపు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం వందల బస్సులు తిరిగే బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటుంది. రోడ్డుపై గోతులు పడటంతో పలు వాహనాలు లోపలికి రాకుండానే బయట నుంచి వెళ్తున్నాయి.

స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్ర కీలకం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఉమ్మడి జిల్లాలో ముస్లిం సమరయోధులది కూడా కీలక పాత్ర ఉందని న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ కంచర్ల హరిప్రసాద్ అన్నారు. పాతన గరంలోని గడ్డ వీధిలో అంజుమన్-ఎ-షంషియా మదరసా సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ముస్లిం స్వాంతంత్ర్య సమర యోధుల చిత్రపటాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. డాక్టర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటీషు వారిపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన అనేక మంది ముస్లిం సమరయోధులను నేడు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టిప్పు సుల్తాన్ మొదలు, జిల్లాలో తొలితరం సమరయోధుడిగా ఖ్యాతిగాంచిన ముస్లిం నవాబు గులాం రసూల్‌ఖాన్‌లను గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. నాడు బ్రిటీషు సైన్యంతో తలపడినప్పుడు రసూల్‌ఖాన్‌తోపాటూ అనేక మంది ముస్లింలు అమరుల య్యారని శ్లాఘించారు. అంజుమన్-ఎ-షంషియా మదరసా కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, రచయిత నసీర్ అహ్మద్ దేశమంతా పర్యటించి, ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను సేకరించి, చరితార్థులు అనే పుస్తకం రాశారని గుర్తు చేశారు. కథా రచయిత ఎస్ఎండీ ఇనాయతుల్లా మాట్లా డుతూ కర్నూలు చివరి నవాబు రసూల్‌ఖాన్ బ్రిటీషు వారితో తలపడి, నగర శివారు జోహరాపురంలో జరిగిన యుద్ధంలో బ్రిటీషు వారికి ఖైదీ అయ్యారని, తర్వాత ఆయన విషంతో చంపబడ్డారని అన్నారు. ఈ సమా వేశంలో గజల్ గాయకుడు మహ్మద్ మియా పాడిన దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రచయిత ఎస్‌డీవీ అజీజ్, నిర్వాహక కమిటీ కార్యదర్శి ఎం.ఖదీరుల్లా, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కంచర్ల హరిప్రసాద్

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్: దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, వారి గురించి సంక్షిప్త చరిత్రతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ విద్యార్థులను, నగర ప్రజలను ఆకట్టుకుంది. అలాగే కర్నూలు చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ తన రాజ్యవైభవాన్ని త్యజించి బ్రిటీషువారితో చేసిన పోరాట స్థలాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. గురువారం కూడా ఈ ఫొటో ఎగ్జి బిషన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పెట్టుబడి తగ్గించడమే పొలంబడి లక్ష్యం



మాట్లాడుతున్న ఏడీఏ అరుణకుమారి

కోడుమూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతన్నలకు పంట సాగులో పెట్టుబడి ఖర్చు తగ్గించడమే పొలంబడి లక్ష్యమని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అరుణకుమారి అన్నారు. మండలంలోని వర్కూరు, కోడుమూరులలో బుధవారం పొలంబడి నిర్వహించారు. రైతులకు పలు సూచనలు అందించారు. ఏవో రవిప్రకాష్, నాగసరోజమ్మ పాల్గొన్నారు.

నేడు సాయిబాబా దేవస్థానంలో 'పసుపు-పారాణి'

కర్నూలు కల్చరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో గురువారాన్ని పురస్కరించుకొని పాతనగరంలోని దక్షిణ షిరిడీ సాయి బాబా దేవస్థానంలో ముత్తయిదువులకు 'పసుపు-పారాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్‌జీ మహబలేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, ఫల, తాంబూలం, గాజులు ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

21న ఖేలో ఇండియా ఉమెన్స్ రగ్బీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ విద్యామందిర్‌లో ఈనెల 21న ఖేలో ఇండియా అస్మిత రగ్బీ (అండర్-15 బాలికలు) పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుడిపల్లి సురేందర్, రామాంజనేయులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రగ్బీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి ప్రవేశ రుసుం లేదన్నారు.

పేద బ్రాహ్మణులను ఆదుకోవాలి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణులను ఆదుకోవాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరామరాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నూతన చైర్మన్‌గా నియమితులైన బుచ్చి రామప్రసాద్‌ను కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వెంకట రామరాజు మాట్లాడుతూ బుచ్చి రామప్రసాద్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియ మించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవా దాలు తెలిపారు.

పోరాటాలకు ఒంగోలు నగరం వేదిక: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు ఒంగోలు నగరం వేదిక కానుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. ఈ నెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల పోస్టరును బుధవారం సీఆర్ భవన్‌లో విడుదల చేశారు. గిడ్డయ్య మాట్లాడుతూ 23న వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభకు సభాధ్యక్షుడు కె.రామకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కే.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి హాజరవుతారన్నారు. సమావేశం లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వి.నాగరాజు, సి.మహేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

సి.బెళగల్ సొసైటీ సెక్రటరీగా ఖాజ

సి.బెళగల్ ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ సొసైటీ సెక్రటరీగా ఖాజ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన రవిరెడ్డి ఆలూరు కేడీసీసీబీ స్టాఫ్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వెళ్లారు. సి.బెళగల్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఖాజను సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు.



మండలంలోని రాతనలో గ్రామ ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు గుంతలు పడి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెంగుళూరు-మంత్రాలయం ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు నరకయాతనగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని కోరుతున్నారు. - తుగ్గలి



మండలంలోని కైరుప్పల నుంచి గార్లపెంట రోడ్డు నీటి కుంటలా మారింది. ఈ దారిలోనే ఆదోనికి నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 12.కి.మీ.లు ఉన్న దారిలో కలపరి, దొడగొండ గ్రామాల మధ్య ఒకచోట దొడగొండ, బైలుపత్తికొండ గ్రామాల మధ్య మరొకచోట రోడ్డు తెగిపోయింది. గుంతలను పూడ్చాల్సి వుంది. - ఆస్పరి



పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ రహదారి ప్రమాదకరంగా మారింది. ఆలూరు-ఆదోని హైవే పక్కనుంచి కాలనీలోకి వెళ్లే దారికి ఇరువైపులా సైడ్‌వాల్ లేదు. పక్కనే 12 అడుగులకు పైగా లోతున్న పెద్దవంక ప్రవహిస్తోంది. వాహనదారులు ఏమాత్రం అదుపు తప్పినా వంకలో ప్రాణాలు పోయే అవకాశం ఉంది. - ఆదోని అగ్రికల్చర్

వర్షాకాలంలో విద్యుత్‌తో జాగ్రత్త

తుగ్గలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న కారణంగా విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, తడి వైర్లను చేతితో ముట్టుకోవద్దని విద్యుత్ ఏఈ చంద్రకళ సూచించారు. బుధవారం గ్రామాల్లో మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ తీగలతో విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎండు కర్ర, గ్లౌజ్‌లు వేసుకుని స్విచ్‌లను ఆన్ చేయాలన్నారు. విద్యుత్ సమస్య వస్తే సిబ్బందికి తెలియజేయాలని, విద్యుత్ స్తంభాలను ఎవరూ తాకవద్దన్నారు.

రోడ్లపై మురుగును తొలగించండి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై మురుగు నిల్వ లేకుండా చుడాలని సీపీఎం నాయకులు వీరశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలని బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నివాసాల మధ్య మురుగు నిల్వలతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆశోక్, యూసుఫ్ బాష, తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులపాటు వర్షాలు


చింతకుంట వద్ద వంతెనను పరిశీలిస్తున్న తహసీల్దార్

హాలహర్వి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం చింత కుంట వద్ద జాతీయ రహదారి వంతెనను పరిశీలించారు. వేదవతి, నిట్రవట్టి, హాలహర్వి వాగులవద్ద ప్రయాణికులు నెమ్మదిగా వెళ్లాలన్నారు. మట్టి మిద్దెల్లో నివసించేవారికి వీఆర్వోలు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు వాతావరణాన్ని చూసి పొలాలకు వెళ్లాలన్నారు. గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ


130 అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీ

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు హర్ ఘర్ తీరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్ ప్రారంభించగా, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కళాశాల నుంచి ఎమ్మిగనూరు సర్కిల్ వరకు 130 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు ఆధ్యాపకులు ఎర్రిస్వామి, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాధన్ వీక్లిఫ్, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ గోవిందు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే అనుమతించాలి

ఆదోని టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాతరూట్ మ్యాప్ ప్రకారంగానే గణేష్ నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలని కలెక్టర్ ను కోరినట్లు గణేష్ ఉత్సవ సమితి సభ్యుడు, బీజేపీ నాయకడు కునిగిరి నీలకంఠ తెలిపారు. అనంత మంగళ ఆంజనేయ ఆలయంతో పాటు టూటౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా అనుమతి ఇవ్వాలని కోరగా, స్పందించిన కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకొంటామని తెలిపారన్నారు. వేణుగోపాల్, గోరంట్ల రమణ, అంజనేయులు, లక్ష్మీకాంత్ ప్రసాద్, రంగస్వామి ఉన్నారు.

పులివెందులలో కూటమి రౌడీ రాజ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి నాయకులు రౌడీల్లా వ్యవహరించాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. బుధవారం ఆలూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి, ఏపీలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. లోకేశ్ అండతో వైసీపీ ఏజెంట్లను రానివ్వకుండా అడ్డుకున్నార న్నారు. పోలీసులు లోకేశ్ చెప్పుచేతుల్లో పనిచేస్తున్నారని, దీన్ని చూస్తే మనం ప్రజాస్వామ్యం దేశంలో ఉన్నామా లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ కన్వీనర్ మల్లికార్జున, భాస్కర్, వెంకటేష్, వీరేష్, జాన్ ఉన్నారు.

తుగ్గలి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా పనిచేశారని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ ఆరోపించారు. బుధవారం జి.ఎర్రగుడిలో మాట్లాఆరు. జడ్పీటీసీ సభ్యుడు పులికొండ నగేష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నారాయణ్ నాయక్ ఉన్నారు.

పాఠశాలలో సిమెంటు.. షెడ్డులో వైద్యం


పాఠశాల గదిలో సిమెంటు బస్తాలు


షెడ్డులో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

● మదనంతపురంలో 104 సేవలకు ఆటంకం

మద్దికెర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం గ్రామ ఎంపీపీ పాఠశాల గదిలో ఓ కాంట్రాక్టర్ సిమెంట్ బస్తాలు వేసి, గోడౌన్‌గా మార్చారు. దీతో ప్రతి బుధవారం నిర్వహించే 104 సేవలను షెడ్డులోనే కానిచ్చేశారు. వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి గ్రామంలో వైద్యసేవలకు వెళ్లగా, గతంలో నిర్వహించే పాఠశాల గదిలో సిమెంటు బస్తాలు దర్శనమిచ్చాయి. అక్కడ అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో పాఠశాల గదుల్లో నిర్వహించేందుకు ప్రయత్నించగా తాళం వేసి ఉంది. చేసేదేమీ లేక వైద్యులు వెనుతిరుగుతుండగా గ్రామానికి చెందిన గుంత హనుమన్న అనే వ్యక్తి తన షెడ్డు ఇవ్వడంతో అందులోనే వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో క్లినిక్ లేకపోవడంతోనే సమస్య వచ్చిందని, భవనాన్ని నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విదేశీ ఒప్పందాలను రద్దుచేయాలి


నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా, బ్రిటన్ దేశాలతో చేసుకున్న విదేశీ వాణిజ్య ఒప్పందాలను రద్దుచేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బుధవారం పట్టణంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పీఎం మోదీ అమెరికా ఎగుమతి దిగుమతి షరతులను అంగీకరించడం సరికాదన్నారు. ఇప్పటికే దేశంలో వ్యవసాయం గిట్టుబాటు కాక చిన్న, సన్నకారు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రైతుల అప్పులను మాఫీ చేసి పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో రైతాంగం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రామాంజనేయులు, గోపాల్, తిప్పన, లక్ష్మణ్, రంగస్వామి, బాషా పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న శేషగిరి

హొళగుంద, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహ్యాట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉషోదయ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం భోజనం ప్లేట్లు పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు సీహెచ్ నాగరాజు తెలిపారు. ముఖ్య అతిథిగా టీడీపీ నాయకుడు చిన్నహ్యాట శేషగిరి హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మారెప్ప, ఖలందర్ పాల్గొన్నారు.

అవయవ దానంతో ప్రాణాలు నిలపవచ్చు

ఆదోని టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంతో మరో ప్రాణాన్ని కాపాడే అవకాశముందని అవోపా ఆదోని అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా సూచించారు. బుధవారం పద్మావతి ఒకేషనల్ కళాశాలలో అవగాహన కల్పించారు. మరొక కుటుంబంలో సంతోషం నింపడం కోసం ప్రతి ఒక్కరు అవయవ దానం చేయాలని కోరారు. డా. మిథిలేష్ కుమార్ అవయవదానంపై అవగాహన కల్పించారు. ఉద్యోగి సావిత్రి, ఉపాధ్యాయిని హాజీరా, గృహిణి పరుచూరి సువర్ణమ్మ తాము అవయవ దాదానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. మరికొందరు విద్యార్థులు రక్తదానం చేయడానికి అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్ గుప్తా రఘు, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనాథ్ గుప్తా

సభ్యులకు సన్మానం

ఆదోని రూరల్, ఆగస్టు 13 (ఆంధ్ర జ్యోతి): సీపీఐ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని ఆ పార్టీ నాయకులు అజయ్ బాబు, వీరేష్, సుదర్శన్ తెలిపారు. 24వ జిల్లా మహాసభల్లో ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి'లో రికార్డులు తప్పనిసరి

తుగ్గలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం పనుల రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలని ఏపీవో హేమసుందర్ సూచించారు. బుధవారం తుగ్గలి ఏపీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వ్యవసాయ పనులు లేని గ్రామాల్లో డిమాండ్ ఇచ్చిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని, కూలీల ఫొటోలు, రికార్డులలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. పండ్ల తోటల పెంపకం పట్ల ఆసక్తి ఉన్న రైతులకు అవగాహన కల్పించాలన్నారు. టీఏలు రాజశేఖర్, రామకృష్ణ, చంద్ర, జయరాం, శాంతరాజు, ఫరీదప్ప, ఎఫ్ఏలు, సీనియర్‌మేట్లు ఉన్నారు.

5 రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

● పత్తికొండ శాటిలైట్ డిపో ఇన్‌చార్జి డీఎం మహ్మద్‌రఫి



పత్తికొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం కింద మహిళలకు 5 రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు పత్తికొండ శాటిలైట్ డిపో ఇంచార్జీ డీఎం మహ్మద్‌రఫి అన్నారు. బుధవారం మాట్లాడుతూ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. సిటీ బస్సు, మెట్రో సిటీ బస్సు, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తిస్తుందన్నారు. అంతరాష్ట్ర, తిరుమల, లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చెల్లదని మహిళలు గమనించాలని కోరారు.

రేపు మాంసం విక్రయం నిషేధం

ఆదోని టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పట్టణంలో మటన్, చికెన్ చేపల క్రయ, విక్రయాలను నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ బుధవారం తెలిపారు. కబేళాలో పశువధ జరపరాదని, మాం సాహార హోటళ్లను తెరవరాదన్నారు. ఆంక్షలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్‌టీఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

వెల్దుర్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో-2 రమేశ్ బుధవారం ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందని, నివాసం నుంచి 5 కి.మీ.ల దూరంలోని పాఠశాలల్లో మాత్రమే ప్రవేశాలు ఉంటాయని, బీపీఎల్ కుటుంబాల వారు ఈ నెల 2లోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

● తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి



ఆలూరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి అన్నారు. ఆలూరు రైతు సమస్యలపై అమరావతిలో టీడీపీ రైతు రైతు కమిటీ రాష్ట్ర అధ్యక్షులు యం.శ్రీనివాసులరెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఆలూరులో జింకల బెడదతో రైతులు పంటలు నష్టపోతున్నారన్నారు. యూరియా ఎరువుల కొరత ఉందని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రానికి రావాల్సిన వాటా ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరినట్లు తెలిపారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎం ధ్యేయం


మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర, బొజ్జమ్మ

మద్దికెర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేయడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి అన్నారు. బుధవారం పెరవలి గ్రామంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసిందన్నారు. ఇప్పటికే 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే.. అందరికీ వారి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని, రేపటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. హంద్రీనీవా నీటితో పిల్లకాల్వల ద్వారా సాగునీరు అందించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. చంద్రశేఖర్‌గౌడ్, నరసింహులు గౌడు ఉన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం


ఎమ్మెల్యేకు రాఖీలు కడుతున్న మహిళ

మద్దికెర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. బుధవారం పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామిని దర్శించుకు న్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి ప్రోత్సాహకంగా రూ.7వేలు వారి ఖాతాల్లో జమ చేశామ న్నారు. 68 చెరువులను నీటితో నింపడం వల్ల ఈ ప్రాంతమంతా పంటలతో కళకళలాడుతుందని తెలిపారు. పత్తికొండ తాలుకాలో ఇప్పటికే రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, మెడికల్ తిమ్మప్ప, పారా రవి, నరసింహులు గౌడు, అంజనేయులు, వెంకటవర్మ ఉన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ : ఎమ్మెల్యే శ్యాంబాబుకు తెలుగు మహిళా అధ్యక్షురాలు జానకి చౌదరి, మార్కెట్ యార్డు డైరెక్టర్ లక్ష్మీదేవి బుధవారం రాఖీ కట్టారు. శ్యాంబాబు నేతృత్వంలో తాలుకా అభివృద్ధి చెందుతుందన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు


కేకు కట్ చేస్తున్న ఆశా వర్కర్లు

పత్తికొండ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తూ జీవో జారీ చేయడం పట్ల ఆశావర్కర్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గోపాల్‌రావు, రవిచంద్ర, ఆశావర్కర్ల యూనియన్ నాయకురాళ్లు ఈశ్వరమ్మ, పావని ఆధ్వర్యంలో బుధవరాం పట్టణంలో కేకు కట్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వయో పరిమితిని 62 సంవత్సరాలు పెంచడమేగాక, మెటర్నరీ లీవ్‌లు 180 రోజులు, వేతనాలతో కూడిన సెలవులు, గ్రాట్యుటీ రూ.1.50 లక్షలు ఇస్తూ జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దుగ్గెన్న, కాశన్న, సునీత, స్వాతి పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళలకు ఉచిత బస్సు


మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

దేవనకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం దేవనకొండలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ సీఎం సీఎం చంద్రబాబు ముందుకు వెళుతుతురన్నారు. టీడీపీతోనే సుస్థిరాభివృద్ధి సాధ్యమన్నారు. బడిగింజల రంగన్న, సూభాన్, కప్పట్రాళ్ల మల్లికార్జున, ఆకుల వీరేష్, వెంకటస్వామిగౌడ్, సర్పంచు బాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి

ఆలూరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలకు కృషి చేయాలని ఎంపీపీ రంగమ్మ, ఎంపీడీవో మద్దిలేటి స్వామి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతిపై శిక్షణ ఇచ్చారు. ఆహార భద్రత కల్పించి మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆర్ఐ బసవన్నగౌడ్, సర్పంచులు ఉప్పర రవి, మోహన్‌రాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఏఈ చౌడారెడ్డి పాల్గొన్నారు.

ఆస్పరి: మండల పరిషత్ కార్యాలయంలో పల్లె ప్రగతి అభివృద్ధి అంచనాలపై శిక్షణ నిర్వహించారు. ఎంపడీవో గీతావాణి, ఎంపీపీ సుంకర ఉమాదేవి, తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారి రఘురామరెడ్డి పాల్గొన్నారు.

గెలుపోటములను సమంగా తీసుకోవాలి

దేవనకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గెలుపోటములను సమంగా తీసుకోవాలని వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. బుధవారం పి.కోటకొండలో కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

బలోపేతం చేయాలి

దేవనకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం వెంకట్రామిరెడ్డి సూచించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో ఎన్యూమరేటర్స్, వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రుణాలను అర్హులకు అందేలా చుడాలని, అవినీతి చోటుచేసుకోకుండా వీవోఏలు బాధ్యత వహించాలన్నారు.

సచివాలయం మూత



తాళం వేసి ఉన్న గూళ్యం సచివాలయం-2

హాలహర్వి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గూళ్యం గ్రామ సచివాలయం-2 బుధ వారం మూతబడింది. ఇక్కడ ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పనిచేస్తుండగా, మిగతా ఉద్యోగులు బదిలీపై వెళ్లిపోయారు. ఆ ఇద్దరిలోనూ ఒకరు సర్వేకి వెళ్లగా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మా కొట్టారు. ఈ విషయాన్ని ఎంపీడీవో వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా విచారణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతన్నకు అండగా సీఎం చంద్రబాబు

● ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం
● టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి


ట్రాక్టర్‌పై ర్యాలీగా వస్తున్న టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

పెద్దకడబూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతన్నలకు అండగా సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం పెద్దకడుబూరులో నాలుగు మండలాల రైతులతో భారీ ట్రాక్టర్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు. కష్టకాలంలో అన్నదాత సుఖీభవ నిధులు వేసి రైతులను ఆదుకున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. రైతుకు ఏ ఆపద వచ్చినా తాము అండగా ఉంటామన్నారు. ప్రతి రైతు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, ఈరన్న, మల్లికార్జున, ఏసోబు, వీరేష్‌గౌడ్, అంజి, అడివప్పగౌడ్, వెంకటేష్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: ఏడీఏ

ఎమ్మిగనూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణ యజమానులు విక్రయించిన ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏడీఏ మహ్మద్ ఖాద్రీ ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దుకాణదారులు రోజువారిగా రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దాంతో స్థానికంగా ఎరువుల వివరాలు ఆన్‌లైన్‌లో అధికంగా నిల్వ ఉన్నట్లు చూపుతుందన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి స్థానిక దుకాణాలకు అవసరానికి తగ్గట్టు ఎరువులు వచ్చే అవకాశం ఉండద న్నారు. దీంతో అటు రైతులు, ఇటు దుకాణాదారులు ఇబ్బందులకు గుర య్యే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎరువుల అమ్మకాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

కూలిన మట్టిమిద్దె

గోనెగండ్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పనూరులో బుధవారం తెల్లవారుజామున పింజరి ఖాజాబీకి చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. మంగళవా రం రాత్రి పింజిర ఖాజాబి తన ముగ్గురు పిల్లలతో కలిసి ఓ గదిలో పడుకున్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మట్టి మిద్దె పూర్తిగా తడిచి వంట గదిలో పైకప్పు ఒకసారిగా కూలిపోయింది. ఇంట్లోని సామాన్లు, బియ్యం, ఇతరత్ర సామగ్రి మొత్తం మట్టిలో కూరుకుపోయాయి. తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఇంట్లోని వస్తువులు తడిసిపోయాయి. ప్రస్తుతం ఆ కుటుంబానికి నిలువ నీడ లేకుండా పోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో జరిగిన విలేకరుల ఆయన మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. ప్రవీణ్ కుమార్, యూనిస్ బాషా, మిన్నప్ప పాల్గొన్నారు.

యూరియా అందించడంలో విఫలం

నందవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు ఆరోపించారు. నందవరంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఇప్పటి వరకు రైతులకు అవసరమైన యూరియా అందించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం యూరియా కృత్రిమ కొరతను నివారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శాంతన్న పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

● మండలంలో 1600 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

కోసిగి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా కొరత లేకుండా రైతులు అడిగినంత యూరియా బ్యాగులు పంపిణీ చేస్తుండటంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క కోసిగి మండలంలోనే రైతు సేవా కేంద్రాల ద్వారా 600 మెట్రిక్ టన్నులు, ఎరువుల దుకాణాల ద్వారా వేయి మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు పంపిణీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలో 800 మెట్రిక్ టన్నులు కూడా యూరియా పంపిణీ చేయలేదు. ఈ ఏడాది రైతులకు అడిగినంత యూరియా బ్యాగులు కూటమి ప్రభుత్వం అందిస్తోంది. ఎన్డీయే ప్రభుత్వంలో రైతులకు పెద్ద పీట వేస్తుంది. ముఖ్యంగా రైతులు యూరియాపై ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.



యూరియా కోసం వచ్చిన రైతులు

గతంలో ఇబ్బంది పడ్డాం


కూటమి ప్రభుత్వంలో యూరియా కొరత లేదు. అడిగినన్నీ సంచులు అధికారులు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో యూరియా లేక ఇబ్బందులు పడ్డాం. ఈ ప్రభుత్వంలో యూరియా కొరత లేకపోవడం రైతులకు శుభపరిణామం.

● శనిగేని హుసేని, రైతు, కోసిగి

యూరియా కొరత లేదు


మండలంలో యూరియా కొరత లేదు. ఇప్పటి వరకు 1600 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశాం. రైతులు మోతాదుకు మించి యూరియాను వాడరాదు. కావాల్సిన వారికి అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

● ఎం.వరప్రసాద్, మండల వ్యవసాయాధికారి, కోసిగి

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

● ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను వినియోగించుకోండి
● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ ఎస్ఈ ఉమాపతితో కలిసి సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై తీవ్రమైన భారాన్ని మోపిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు బనవాసిలో 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరయ్యిందని టెండర్లు కూడా పిలిచామన్నారు. అంతేగాక నియోజకవర్గంలోని రాగిమాన్ దొడ్డి, గాజులదిన్నె, పెద్దమరివీడు గ్రామాల్లో 33కేవీ సబ్‌స్టేషన్లు ఏర్పాటు కానున్నాయన్నారు. దీంతో విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో స్పెషల్ డ్రైవ్‌కింద ఈ పథకాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇది ఎస్సీ, ఎస్టీలకు ఉచిత పథకం అన్నారు. బీసీలకు ఇతరులకు 90శాతం బ్యాంకు ద్వారా రుణం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఈఈ శాంతి స్వరూప్, డీఈఈ నాగేంద్ర ప్రసాద్, ఏఈ ప్రసన్న ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏఏవో మాధవశెట్టికి ఉత్తమ పురస్కారం

సత్కరించిన పీఠాధిపతి


శ్రీమఠం ఏఏవోకు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా 2025 - రాఘవేంద్ర అనుగ్రహ పురస్కారాన్ని శ్రీమఠం ఏఏవో ఎల్.మాధవశెట్టి అందుకున్నారు. బుధవారం ఉత్సవాల్లో భాగంగా యోగీంద్ర కళా మండపంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో, ప్రశంసాపత్రం, నగదు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు. శ్రీమఠానికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషీ, సురేష్ కోనాపూర్, డీఎం ఆనందరావు, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, జేపీ స్వామి, వాదిరాజాచార్, సుజ్ఞానేంద్రాచార్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బదిలీలు వెంటనే చేపట్టాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డిగ్రీ కళాశాలల అధ్యాపకుల బదిలీలను వెంటనే చేపట్టాలని అధ్యాపకులు కోరారు. బుధవారం కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నెలరోజుల క్రితం సాధారణ బదిలీలు చేపట్టినప్పటికీ ఇప్పటివరకు బదిలీల ఉత్తర్వులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బదిలీల ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అధ్యాపక సంఘం నాయకులు పాల్ దేవదానం, ఎం సుశీలమ్మ, క్రాంతికుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న అధ్యాపకులు

పోషక లోపంతో దిగుబడి తగ్గుతుంది

మంత్రాలయం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులు పాటించకపో వడం, పోషక లోపంతో పంట దిగుబడి తగ్గుతుందని సాంకేతిక యాజమాన్య సంస్థ అధికారి హేమలత, టెక్నికల్ ఏవో అనిల్ అన్నారు. బుధవారం మండలంలోని చిలకలడోన, కల్లుదేవకుంట గ్రామాల్లో పంటలకు సోకే వైరస్, దోమ, ఆధునిక యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. హేమలత మాట్లాడుతూ ఆధునిక యాజమాన్య పద్ధతుల వల్ల రసాయనిక పోషక లోపాలు గుర్తించి దానికి తగ్గట్టు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఏఈవో తిరుమల్‌రెడ్డి, వీపీఏలు హనుమంతు, ఈరన్న, లక్ష్మన్న, బజారి, రంగన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ముందు ఎన్ఎంయూ అధ్యక్షుడు రఫీక్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతన సవరణ చేపట్టాలని, ఐఆర్ ప్రకటించాలన్నారు. గవర్నర్ పేట -2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని ఆయా సంస్థలకు బదలాయిస్తూ ఇచ్చిన జీవోను నిలిపివేయాల డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు. జిల్లా ప్రచార కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ముస్తాక్, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

వరద నియంత్రణ చర్యలపై నిర్లక్ష్యం తగదు: సబ్ కలెక్టర్

గోనెగండ్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వరద నియంత్రణ, సహాయక చర్యలు చేపట్టడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. బుధవారం గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లను ఆయన పరిశీలించారు. గేట్ల పనితీరు ఎలా ఉంది, ప్రస్తుతం ప్రాజెక్టులో ఎన్ని టీఎంసీల నీరు ఉంది, నిల్వ సామర్థ్యం ఎంత, భద్రత పనితీరు ఎలా ఉంది? ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం నియంత్రణ తీరు ఎలా ఉందని జీడీపీ ఇరిగేషన్ ఏఈ మహమ్మద్ ఆలీని అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ నీటి నిల్వ కెపాసిటీ 4.5 టీఎంసీలని, ప్రస్తుతం 1.8 టీఎంసీ నీరు ఉందన్నారు. ఆరు గేట్లలో నాలుగు గేట్లు సక్రమంగా పని చేస్తున్నాయని వివరించారు. హంద్రీనది ద్వారా ప్రస్తుతం 150 క్యూసెక్కుల నీరు వస్తుండగా, హంద్రీనీవా పథకం నుంచి 160 క్యూసెక్కులు, తుంగభద్రదిగువ కాలువ నుంచి 84 క్యూసెక్కులు చేరుతున్నాయన్నారు. అత్యవసర ప్రణాళికపై పూర్తి నివేదిక తీసుకున్నారు. ప్రాజెక్టు వద్ద కచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని చెప్పారు. వరద నీరు ఎంత వస్తుందో ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇరిగేషన్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజేశ్వరి, ఉగ్ర నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.


పెంచిన కట్టను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్


మంత్రాలయంలో బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీల్లో పాల్గొన్న నిర్వాహకులు

మంత్రాలయం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సంతమార్కెట్‌లో బండలాగుడు పోటీలు నిర్వహించారు. మంత్రాలయానికి చెందిన వణిక రాము ఎద్దులు మొదటి విజేతగా నిలువగా టీడీపీ నాయకులు వరదరాజు, అశోక్‌రెడ్డి రూ.15వేల నగదు బహుమతి అందజేశారు. అలాగే ఈడిగ గోవిందు ఎద్దులు ద్వితీయస్థానంలో నిలవగా, కంసాలి నరసింహ రూ.10వేల నగదును అందజేశారు. బెస్త గోవిందు ఎద్దులు మూడవ స్థానంలో నిలవగా ఎంపీటీసీ మేకల వెంకటేశ్ రూ.5వేల నగదును అందజేశారు. గెలుపొందిన వృషభాల యజమానులను ఊరేగించి గ్రామ దేవతలకు పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కురువ మల్లికార్జున, వైస్ ఎంపీపీ రఘు, రాఘవేంద్ర, రామాంజనేయులు, గోవిందు, శివ, పోలీసులు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతి

సామాజిక తనిఖీల్లో అధికారుల వెల్లడి


సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో మొత్తం దాదాపు రూ.50వేల అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్‌లో వెల్లడైంది. నెల రోజుల పాటు ఉపాధి హామీ నిధులతో ఆయా గ్రామాల్లో ఏడాది కాలం పాటు చేపట్టిన మొత్తం 1491 పనులపై ఆడిట్ అధికారులు విచారణ చేపట్టారు. మొత్తం 1491 పనుల్లో రూ.50వేల వరకు అవినీతి జరిగినట్లు బుధవారం చేపట్టిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వెల్లడైంది. ఇందులో కందనాతి గ్రామ పంచాయతీలో రూ.12,536వేలు, పెసలదిన్నెలో రూ.1168వేలు, కడివెళ్లలో రూ.3,400వేలు, కడిమెట్ల రూ.10,888, పార్లపల్లి రూ.882, గుడికల్లు రూ.2,025, కోటేకల్లు రూ.4,445, కలుగొట్ల రూ.1346, మల్కాపురం రూ.3013వేలు, కె. తిమ్మాపురం రూ.877, దైవందిన్నె రూ.298 ల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. ఈ సొమ్మును సంబంధిత ఎఫ్‌ఏలు, టీఏల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే పనులు సక్రమంగా చేయకపోవడం వంటి కారణాలతో పెసలదిన్నె రూ.6వేలు అపరాధ రుసుము, కె.తిమ్మాపురం రూ.3వేలు, ఏనుగుబాల రూ.2వేలు, గుడికల్లు రూ.4వేలు, కోటేకల్లు రూ.3వేలు, కలుగొట్ల రూ.4వేలు, మల్కాపురం రూ.3వేలు, సోగనూరు రూ.2వేలు, దేవిబెట్ట రూ.వెయ్యిల వరకు జరిమానా విధించినట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ వెంకటరమణయ్య తెలిపారు. సమావేశంలో డీవీపీ లోకేష్, ఏపీడీ అల్లిపీర, అడిషనల్ పీడీ మాధవిలత, ఏపీవో విజయ్‌మోహన్, ఆయా గ్రామాల టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రేపు 'స్త్రీ శక్తి' ప్రారంభం

● డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ హరినాథ్


మాట్లాడుతున్న హరినాథ్

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రారంభించనుందని డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ హరినాథ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ మద్దిలేటి నాయుడుతో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 15న సీఎం చంద్రబాబు నాయుడు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తమ గుర్తింపు కార్డులు ఆధార్, రేషన్, ఓటర్ కార్డులు చూపించి జీరో టికెట్‌ను పొందవచ్చన్నారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

గోనెగండ్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపై ఆగస్టు 15న జాతీయ జెండా ఎగరాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అనంతశయన, ప్రధానోపాధ్యాయులు బతకన్న కోరారు. బుధవారం గోనెగండ్లలోని మెయిన్ పాఠశాల విద్యార్థులు హర్‌ఘర్‌తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాను పట్టుకొని నినాదాలు చేశారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం గొప్పతనం, పోరాట యోధుల గాథలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన ఉండాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పౌరహక్కులపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ పులిగుజ్జు సురేష్, సీఆర్ఆర్ఐ టీం మెంబర్ కొమ్మపాలేం శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండలంలో బీసీఆర్ఎఫ్(బహుజన్ సివిల్ రైట్స్ ఫోరం) సమావేశం నిర్వాహకులు పల్లవి దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ బీసీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో పౌరుల హక్కులపై అవగాహన కల్పించటమే కాకుండా స్కిల్ డెవలప్‌మెంట్, మహిళా సాధికారత, సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్, పూలే భావజాలమే బీసీఆర్ఎఫ్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సభ్యులు సునీల్ కుమార్, ముత్తు, రవి, ప్రభాకర్, మునిస్వామి, మధు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ఎమ్మిగనూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగొట్ల రోడ్డులో ఉన్న ఎంబీ చర్చి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పాస్టర్ రెవరెండ్ జయరాజ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరంలో గైనిక్, గుండె, ఈఎన్‌టీ, ఐ, ఆర్థోపెడిక్, డెంటల్, స్కిన్, కిడ్నీ, లివర్, చిన్నపిల్లలు, జనరల్ ఫిజీషియన్ వైద్యులు హాజరై రోగులకు వైద్యపరీక్షలు చేస్తారన్నారు. ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.